## నేనే కూలుస్తా.. హైడ్రా నోటీసులపై నటుడు మురళీమోహన్ స్పందన..!

చేపట్టారనే మురళీ మోహన్‌పై ఆరోపణలు ఉన్నాయి. 15 రోజుల్లో నిర్మాణాలు కూల్చివేయాలని నోటీసులు ఇచ్చారు. లేని పక్షంలో తామే కూల్చివేస్తామని హైడ్రా వార్నింగ్ ఇచ్చింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. గచ్చిబౌలి పరిధిలోని రంగళాల్ కుంట చెరువును సందర్శించారు అక్కడ జయభేరి కన్‌స్ట్రక్షన్స్ నిర్మాణాలను పరిశీలించారు. స్థానికులను, అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అక్రమంగా నిర్మించారని నిర్ధారణకు వచ్చాక కూల్చివేత నోటీసులు ఇచ్చారు. ఈ నోటీసులపైనే మురళీ మోహన్ తాజాగా స్పందించారు. అటు మేడ్చల్ జిల్లా దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేటలో అక్రమంగా నిర్మించిన విల్లాలను హైడ్రా కూల్చివేస్తోంది. ఆదివారం ఉదయమే అక్కడికి చేరుకున్న అధికారులు.. యంత్రాల సాయంతో కూల్చివేతలు చేపట్టారు. ఇందులో ఎక్కువగా విల్లాలు ఉన్నాయి. మల్లంపేట్ కత్వా చెరువుకు సంబంధించిన ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిబంధనలకు విరుద్ధంగా విల్లాలు నిర్మించినట్లు అధికారులు గుర్తించారు. ఆదివారం ఉదయమే మల్లంపేట్‌లోని లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ విల్లాల వద్దకు అధికారులు, పోలీసులు చేరుకున్నారు. బందోబస్తు మధ్య హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. విల్లాలకు సంబంధించిన యాజమానులు ఆందోళనకు దిగారు. నిబంధనల మేరకే తాము కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా.. పేపర్లు ఉన్నా ఎలా కూలుస్తారని ప్రశ్నిస్తున్నారు. కోర్టుకు పోవడానికి వీలు లేకుండా వారాంతాల్లో మాత్రమే ఉండేలా హైడ్రా కూల్చివేతలు చేపడుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు హైడ్రా కోసం ప్రత్యేక పోలీసు వ్యవస్థను కూడా తీసుకొచ్చే యోచనలో ప్రభుత్వం ఉంది. సాధారణ పోలీసులను దీని అవసరాల కోసం వినియోగిస్తే రోజువారీ విధులకు ఆటంకం కలుగుతుందని.. ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఇదే జరిగితే.. దేశంలోనే నాలుగో ప్రత్యేక పోలీస్ వ్యవస్థ కానుంది. తెలంగాణలో ఇప్పటికే సైబర్ సెక్యూరిటీ, నార్కొటిక్స్ విభాగాలకు రెండు ప్రత్యేక పోలీస్ స్టేషన్లను ప్రారంభించారు.

పరిధి విస్తరించే ఆలోచన..

హైడ్రాను మరింత విస్తరించేందుకు రంగం సిద్ధమవుతోంది. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ పరిధి వరకు ఉన్న హైడ్రాను.. హెచ్‌ఎండీఏ వరకు విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ వ్యవస్థను మూడు జోన్లుగా విభజించి.. వాటి బాధ్యతలను ఎస్పీ స్థాయి అధికారులకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న అక్రమ కట్టడాలు కూడా నేలమట్టం కానున్నాయి.

## ఐకమత్యానికి కేరాఫ్ అడ్రస్ ఆదివాసులు ఇంద్రవెల్లి స్తూపం నిదర్శనం

హైదరాబాద్ : ఐకమత్యం అంటే తరుచు ఆదివాసులే గుర్తుకు వస్తారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో.. వారు ఏదైనా అనుకుంటే నెరవేర్చుకునే వరకు పోరాటం ఆపరు, వారు వారి గ్రామ పెద్దల మాటలను తప్ప వేరే వారి మాటనే వినరు అని పేరు. ఆదివాసీలను ఒప్పించాలంటే చాలా చాలా కష్టతరం అని చెప్పుకుంటారు. ఒకసారి ఆదివాసీలు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు అంటే ఇక ఆ పని పూర్తయ్యే వరకు వారి పోరాటం ఆగదని అధికారులు, రాజకీయ నాయకులు చర్చలు చేస్తుంటారు. నిత్యం కొమురం భీమ్ పోరాట స్ఫూర్తిని నింపుకుంటూ కొనసాగుతారు ఈ ఆదివాసీలు. జల్, జంగల్, జమీన్ అనే నినాదంతో ఆదివాసులు తమ హక్కుల కోసం ఇంద్రవెల్లిలో శాంతియుతంగా సమావేశం జరుపుతుండగా పోలీసులు జరిపిన కాల్పుల్లో ఆదివాసులు అమరులు కాగా, మరికొందరు రక్తపు మడుగులో ప్రాణాలను అరచేతిలో పట్టుకొని పుట్టకొకడు, గుట్టకొకడు వెళ్లి ప్రాణాలను రక్షించుకున్నారు. ఆ సంఘటనకు సరిగ్గా ఏప్రిల్ 20 నాటికి 43 ఏండ్లు అయ్యింది. ఉట్నూర్ ఏజెన్సీ పరిధిలోని ఇంద్రవెల్లిలో 1981 ఏప్రిల్ 20న అప్పటి రైతు కూలీ సంఘం, పోర్క దొరలు (ప్రస్తుత పీపుల్స్ వార్) ఆదివాసులు ఎదుర్కొంటున్న భూసమస్యలు, అటవీ అధికారుల వేధింపులు, పంటలకు గిట్టుబాటు ధర లేక దళారుల మోసాలు తదితర సమస్యల పరిష్కారానికి ఇంద్రవెల్లి సమీపంలోని హీరాపూర్ లో సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఆ రోజున వారాంతపు సంత కావడంతో జిల్లా నలుమూలల నుంచి ఆదివాసులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఇది గమనించిన పోలీసులు సమావేశానికి అనుమతి లేదంటూ వచ్చే ప్రజలను లోపలికి వెళ్లకుండా ఆంక్షలు విధించారు. ఈ సందర్భంగా సమావేశానికి వెళ్లే ఓ ఆదివాసీ మహిళకు పోలీసులు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇద్దరి మధ్య మాట మంతి పెరగడంతో అది కాస్త తీవ్ర స్థాయికి చేరుకుంది. దీంతో కోపోద్రిక్తురాలైన ఆ మహిళ తన చేతిలో ఉన్న కొడవలితో ఆ కానిస్టేబుల్ పొట్టలోకి కొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే తన ప్రాణాన్ని వదలిపెట్టాడు. దీంతో సమావేశంలో పోలీసులకు, ఆదివాసులకు మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. పరిస్థితి చెయ్యి దాటి పోవడంతో అప్పటి ఆర్డీఓ అంబరీష్ పోలీసులు కాల్పులకు అనుమతి నివ్వడంతో ఇంకేముంది పోలీసులు తమ తుపాకీ గుండ్లకు పనిపెట్టడంతో ఆదివాసులు పిట్లల్లా రాలిపోయారు. మరికొందరు అరచేతిలో ప్రాణాలను పెట్టుకొని నలు దిక్కుల్లా పరుగెత్తారు. ఈ సంఘటనలో కేవలం 11 మంది మాత్రమే చనిపోయినట్లు ప్రభుత్వ లెక్కలు తెలుపుతున్నాయి. కానీ ఆదివాసులు మాత్రం తమ వారు పదుల సంఖ్యలో తమ ప్రాణాలను అర్పించారని ఆదివాసులు పేర్కొంటున్నారు. ఆదివాసీలు స్మృతి చిహ్నంగా ఇంద్రవెల్లిలోని హీరాపూర్ లో వారి స్మారకార్థం పీడబ్ల్యూజీ గ్రూప్ ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఇక్కడ ప్రతియేటా ఏప్రిల్ 20న అమరుల నివాళికి ప్రభుత్వం ఆంక్షలు విధిస్తోంది. పరిసర ప్రాంతం 5 కిలోమీటర్ల వరకు 144 సెక్షన్ విధించడంతో పాటు అటు ఉట్నూర్ ఎక్స్ రోడ్డు నుంచి గుడిహత్నూర్ వరకు ప్రజలు రాకుండా గట్టి పోలీసు బందోబస్తు విధించేవారు. ఆ రోజున సంస్మరణ దినానికి అనుమతులు ఇచ్చేవారు కాదు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం పోలీసులు బందోబస్తు మధ్య కొన్ని ఆంక్షలతో అమరవీరుల స్తూపం వద్దకు పూజలకు అనుమతినిచ్చింది. ప్రస్తుతం అమరులైన కుటుంబీకులతో పాటు ఆదివాసీలు ఆచార సాంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వమే కట్టించిన స్తూపం

జల్ జంగల్ జమీన్ పోరాట యోధుడు కొమురం భీమ్ పోరాటానికి మద్దతుగా ఇప్పటికి పోడు వ్యవసాయంపై దున్నే వాడిదే భూమి అన్నట్లుగా ప్రభుత్వంతో పోరాడుతూనే ఉన్నారు ఏజెన్సీ ఆదివాసీలు. తమ హక్కులు పూర్తిగా ఇవ్వకుండా ప్రభుత్వం అణచి వేస్తుందన్నట్లుగా ప్రశ్నిస్తూనే ఉంటారు. వీరి ఐకమత్యానికి ప్రతియేటా ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహణకు ఉదాహరణ. అదేవిధంగా ప్రభుత్వమే ఆదివాసుల ఒత్తిడికి దిగి వచ్చి ప్రభుత్వ ఖర్చులతో నిర్మించిన అరుదైన అమరుల స్తూపం కావడం విశేషం.

## విజయవాడకు గండం తప్పింది :సీఎం చంద్రబాబు

మొదటి పేజి తరువాయి

అంచనాల కోసం ప్రభుత్వం ఎంత వర్షపాతం నమోదైందో డేటాను సేకరిస్తున్నదని, వరదల వల్ల ఏర్పడిన అడ్డంకులను కూడా తొలగిస్తున్నదని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. శనివారం విజయవాడలో దాదాపు రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. అంతకుముందు నాలుగు రోజులపాటు కురిసిన వర్షాల కారణంగా ఆంధ్రప్రదేశ్ లో తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ మేరకు చంద్రబాబు ప్రస్తుత పరిస్థితిపై సమీక్షించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ బుడమేరుఎత్తిపోతలను పూడ్చామని, ప్రస్తుతం విజయవాడకు వచ్చే ఇన్‌ఫ్లోలు తగ్గాయన్నారు. దీంతో పెద్ద గండం తప్పిందని చెప్పారు. నాలుగు రోజులుగా నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.రామానాయుడు, మానవ వనరుల అభివృద్ధి మంత్రి నారా లోకేష్ ఈ పనులపై దృష్టి సారించినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఉల్లంఘనలను పూడ్చేందుకు ఆర్మీ బృందాలు రాష్ట్ర యంత్రాంగంతో సన్నిహిత సమన్వయంతో పనిచేశాయన్నారు. ఉల్లంఘనలను పూడ్చడానికి వేలాది ఇసుక సంచులు, హెస్కో సంచులు మరియు మెటల్ బురుజులను ఉపయోగించారు. బుడమేరు పూర్తిగా ఆక్రమణకు గురై నీటి ప్రవాహాన్ని అడ్డం పెట్టుకుని యథేచ్ఛగా ఇళ్లు నిర్మించుకున్నారని సీఎం అన్నారు. గతంలో వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాలను నేడు సరిదిద్దుతున్నామని, ఫలితంగా బుడమేరు ప్రవాహానికి తెరపడిందని సీఎం అన్నారు. రాష్ట్రానికి శాపంగా మారిన సాగునీటి ప్రాజెక్టులను గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు.

## వినాయక మండపాలకు ప్రభుత్వం ఎలాంటి చలాన్లు విధించట్లేదు హోంమంత్రి అనిత

అమరావతి : ఏపీలో వినాయక మండపాల ఏర్పాటుకు రుసుములు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై హోంమంత్రి అనిత క్లారిటీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో వినాయక మండపాల ఏర్పాటుకు వసూలు చేసే వివిధ రకాల రుసుములన్నింటినీ పది రోజుల కిందటే రద్దు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం గణేష్ మండపాల ఏర్పాటుకు సింగిల్ విండో విధానం అమల్లోకి తీసుకొచ్చేటప్పుడు, జగన్ సర్కార్ హయాంలో నిర్ణయించిన రుసుములన్నీ అధికారులు ఇచ్చిన నోట్ ప్రకారం ప్రకటించామన్నారు. సీఎం చంద్రబాబు దృష్టికి ఈ విషయం వచ్చిన వెంటనే గత ప్రభుత్వం నిర్ణయించిన విధానం రద్దు చేశామన్నారు. ఏ ఒక్క అనుమతికి డబ్బులు తీసుకోకూడదని స్పష్టం చేశామన్నారు. గణేష్ ఉత్సవ కమిటీలు ఏ ఒక్క అనుమతికి రూపాయి కూడా చెల్లించనక్కర్లేదని తెలిపారు. వినాయక మండపాలకు ప్రభుత్వం ఎలాంటి చలాన్లు విధించట్లేదని హోంమంత్రి అనిత తెలిపారు. అయితే మండపాలకు చలాన్లు వసూలు చేసే జీవోను వైసీపీ ప్రభుత్వమే తీసుకు వచ్చిందన్నారు. సీఎం చంద్రబాబు దృష్టికి ఈ విషయం రాగానే చలాన్లు వసూలు చేయొద్దని చెప్పారన్నారు. మరోవైపు పేటీఎం బ్యాచ్‌ను దింపి జగన్ విష ప్రచారం చేయిస్తున్నారని హోంమంత్రి మండిపడ్డారు. 2022లోనే వైసీపీ ప్రభుత్వం గణేష్ మండపాల చలాన్లకు సంబంధించిన జీవో ఇచ్చిందని తెలిపారు. తాము ఆ జీవోలో ఉన్న వాటిని చెప్పామంతే, కానీ, సింగిల్ విండో విధానంలోనే గణేష్ మండపాలకు అనుమతి ఇచ్చామన్నారు. మరోవైపు ప్రకాశం బ్యారేజీ బోట్ల ఘటనపై అనుమానాలు ఉన్నాయని హోంమంత్రి అనిత చెప్పారు. ప్రకాశం బ్యారేజీ గేట్లను ఢీకొన్న బోట్లకు సంబంధించి సమగ్ర విచారణ జరుగుతోందన్నారు. వినాయక మండపాలకు చలాన్లు విధించడంపై బీజేపీ నాయకురాలు, హీరోయిన్ మాధవీలత మండిపడ్డారు. హోంమంత్రి అనితపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. గణేశ్ మండపాల దగ్గర చిల్లర డబ్బులు ఏరుకోవడం ఏంటని నిలదీశారు. హిందువులు ముఖ్యంగా వినాయక భక్తులు భిక్షం వేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారన్నారు. అసలే గణేశుడికి ఆకలి ఎక్కువ, ఆయన కోసం వండే వాటిని తగ్గించి మీకు నాలుగు చిల్లర డబ్బులు వేస్తారు అంటూ తీవ్రంగా స్పందించారు. అందరూ మా పండగల మీద చిల్లర ఏరుకోవడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. సమాన ధర్మం అని చెప్పి మా మైక్ సెట్‌కి, మా గణేశ మండపాలకు, మా గణేష్ ఎత్తుకి డబ్బులెందుకో? అని ప్రశ్నించారు. కృష్ణా నదికి భారీ వరద వస్తున్న సమయంలో నాలుగు వైసీపీ రంగులున్న బోట్లు వచ్చి ప్రకాశం బ్యారేజీని ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ బోట్లుపై టీడీపీ నేతలు ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టారు. ఇవి గొల్లపూడికి చెందిన ఉషాద్రి, సూరాయపాలెంకు చెందిన కోమటి రామ్మోహన్?కు చెందిన పడవలుగా పోలీసులు గుర్తించారు. వైసీపీ ఎమ్మెల్సీ తలసిల రఘురాం ముఖ్య అనుచరుడు, సూరాయపాలెంకు చెందిన కోమటి రామ్మోహన్? అని టీడీపీ ఆరోపిస్తుంది. రాజధాని గ్రామాల్లో, నందిగం సురేష్ తో కలిసి నడిపిన ఇసుక మాఫియాలో కోమటి రామ్మోహన్? కీలకంగా వ్యవహరించారని టీడీపీ ఆరోపిస్తుంది. ఈ కేసుకు సంబంధించి గొల్లపూడికి చెందిన కోమటి రామ్మోహన్ రావు, అతడి ప్రధాన అనుచరుడుని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# ఇదీ చంద్రబాబు స్కూల్ అంటే..స్పష్టమైన మార్పు.. అభివృద్ధి ఉరకలేస్తోంది

మొదటి పేజి తరువాయి

సంక్షేమం నిజమైన అర్థం ఏమిటో తెలిసేలా పథకాలు అమలు అవుతున్నాయి. ప్రజలు కష్టాలలో ఉన్నప్పుడు ప్రభుత్వ వారిని అన్ని విధాలుగా ఆదుకుంటోంది. మూడు నెలలలోనే ఇంతటి మార్పునకు కారణమేంటి? అంటే లభించే జవాబు. నాయకత్వం. సమర్థుడైన నాయకుడు తాను కష్టపడటమే కాదు... తన టీమ్ ను సైతం సమర్థంగా పని చేసేలా గైడ్ చేస్తారు. ప్రభుత్వం, పాలనా అన్నది ఒక సమష్టి బాధ్యత అన్న భావన అందరిలో కలిగిస్తారు. టీమ్ స్పిరిట్ అన్నది అందరిలోనూ నింపుతారు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే.. ఒక స్కూల్ లో ప్రధానోపాధ్యాయుడు సమర్థుడైతే.. ఆయన ఆలోచనలకు, సూచనలకు అనుగుణంగా ఉపాధ్యాయులు సైతం విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతారు. అందు కోసం శ్రమిస్తారు. తద్వారా విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బలమైన పునాదులు పడతాయి. అదే తరహాలో ప్రభుత్వాన్ని నడిపించే ముఖ్యమంత్రి సమర్థుడైతే మంత్రివర్గం, నాయకులు ప్రజలకు అండగా నిలుస్తారు. ప్రజల సాధక బాధకాల్లో పాలుపంచుకుంటారు. ప్రస్తుతం ఏపీలో సరిగ్గా అలాంటి సమర్థ ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రభుత్వమే ఉంది. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా జరుగుతోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారు. అదే సమయంలో అభివృద్ధినీ పరుగులు పెట్టిస్తున్నారు. కష్టం వస్తే సమష్టిగా కదిలి బాధితులకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. కనీవినీ ఎరుగని రీతిలో విజయవాడను భారీ వర్షాలు వరదలూ ముంచెత్తి రోజుల తరబడి ప్రజలు ముంపులో చిక్కుకుంటే.. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కదిలింది. బాధితులను ఆదుకుంది. భరోసా ఇచ్చింది. ధైర్యం చెప్పింది. కష్టాలలో తాము ఒంటరిగా లేమన్న ధీమాను జనంలో కలిగించింది. ప్రకాశం బ్యారేజీ వద్ద రికార్డు స్థాయిలో వరద ప్రవాహం రావడం, ఎన్నడూ లేని విధంగా బుడమేరు పొంగి పొర్లడం.. మూడు ప్రాంతాల్లో గండ్లు పడటంతో విజవాడలోని అనేక ప్రాంతాలు నీట మునిగాయి. మనిషి లోతు నీళ్లు చేరాయి. అప్రమత్తమైన సీఎం చంద్రబాబు నాయుడు వరదనీరు వచ్చిన కొద్ది గంటల నుంచే ముంపు ప్రాంతాల్లో స్వయంగా పర్యటించి ముంపు బాధితులకు భరోసా ఇవ్వడమే కాకుండా సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ఏడు రోజులుగా ముంపు బాధితులకు ప్రభుత్వం ఆహారం, కూరగాయలు, పాలు, పండ్లు అందిస్తూ వారికి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నారు. ముంపు బాధితులలో ధైర్యాన్ని నింపారు. నేనున్నా అన్న భరోసా ఇచ్చారు. ఇప్పుడిప్పుడే వరద తగ్గుముఖం పడుతుండటంతో ముంపు ప్రాంతాల ప్రజలు ఊపిరిపీల్చుకుంటున్నారు. విజయవాడను వరద ముంచెత్తిన విషయం పక్కనపెడితే.. వరద ప్రాంతాల్లోని ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సహాయక చర్యలను చూసి దేశం మొత్తం ఆశ్చర్యపోతుంది. ఆపత్సమయాలలో ప్రజలను ఆదుకునే తీరు ఇదే అంటూ ప్రశంసలు గుప్పిస్తోంది. సమర్థ సీఎం ఉంటే.. ఆ రాష్ట్ర ప్రజలకు ఎలాంటి సమస్య ఎదురైనా ఇబ్బంది ఉండదన్న విషయాన్ని చంద్రబాబు నాయుడు దేశానికి మరోసారి చాటి చెప్పారు. విజయవాడ ముంపు బాధితులను ఆదుకోవడంలోనూ, వారికి ధైర్యం చెప్పి భరోసా ఇవ్వడంలోనూ చంద్రబాబే ఒక సైన్యంగా, ఒక ధైర్యంగా నిలబడ్డారు. జాతీయ మీడియా సైతం సీఎం చంద్రబాబు నాయుడు వరద ప్రాంతాల్లో పర్యటిస్తుండటం, మంత్రివర్గం, అధికారులు, ఎమ్మెల్యేలు ముంపు ప్రాంతాల్లో ప్రజలకు అండగా నిలుస్తున్న తీరుపై ప్రశంసల వర్షం కురిపిస్తోంది. ముఖ్యంగా విజయవాడ నగరంలోకి వరద రావడానికి కారణమైన బుడమేరుకు పడిన మూడు గండ్లను దగ్గరుండి పూడ్చివేయించే బాధ్యతలను సీఎం చంద్రబాబు నాయుడు నీటిపారుదల శాఖ మంత్రి రామానాయుడుకు అప్పగించారు. చంద్రబాబు ఆదేశాల మేరకు రాత్రి, పగలు అనే తేడాలేకుండా.. వర్షం, చలిని లెక్క చేయకుండా గండ్ల వద్దనే ఉండి దగ్గరుండి పనులు వేగంగా చేయించారు. మూడు రోజుల్లోనే మూడు గండ్లను పూడ్చివేసి శెభాష్ రామానాయుడు అనిపించుకున్నారు. ఒక్క రామానాయుడే కాదు.. మంత్రివర్గం, తెలుగుదేశం ఎమ్మెల్యేలు ముంపు ప్రాంతాల్లో ప్రజలకు అందిస్తున్న సేవలను చూసి రాష్ట్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇలాంటి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నందుకు గర్వంగా ఉందంటూ పొంగిపోతున్నారు. నిర్మల రామానాయుడుతో పాటు.. మంత్రివర్గం మొత్తం వరద సహాయక చర్యల్లో నిమగ్నమైంది. గతవారం రోజులుగా మంత్రి నారా లోకేశ్ వరద ప్రాంతాల్లో పర్యటిస్తూ, కంట్రోల్ రూమ్ ఉండి వరద ప్రాంతాల్లో అందుతున్న సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఆర్టీజీఎస్ శాఖ మంత్రిగా లోకేష్ రియల్ టైమ్ గవర్నెన్స్ పవరేంటో చూపారు. వరద ఉధృతంగా ఉన్న మూడురోజులు తన నియోజకవర్గంలో కరకట్టకు కాపలాకాసిన పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వరద తగ్గిన వెంటనే రంగంలోకి దిగి రాష్ట్ర నలుమూలల నుంచి నిత్యావసర సరుకులు తెప్పించి, బాధితులకు అందించే పనిలో ఉన్నారు. ఇక రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ రెండు రోజుల పాటు తన నియోజకవర్గంలో కట్టకు కాపలాకాసి, తర్వాత నుంచి గండ్లుపూడ్చే పనిలో నిమగ్నమయ్యారు. అలాగే విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, తన జిల్లాలో కట్టకు గండి పడకుండా అప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారు. వానలో వరదలో ఆయన ప్రజల మధ్యనే నిలిచారు. వరద తగ్గుముఖం పట్టగానే ముంపు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలపై దృష్టిపెట్టారు. అత్యంత వేగంగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేలా చూశారు. మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ వరద ప్రాంతాల్లోనే మకాం వేశారు. ప్రజలకు ఏ కష్టం రాకుండా కాపు కాశారు. ముంపు తగ్గిన తరువాత ఆయా ప్రాంతాలలో పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల నుంచి పారిశుద్ధ్య సిబ్బందిని రప్పించి ముంపు ప్రాంతాల్లో క్లీనింగ్ చేయిస్తున్నారు. విపత్తులశాఖ కూడా చూసే హోమ్ అనిత అయితే విశ్రాంతి అనే మాటే లేకుండా చంద్రబాబు వెంట వరద నీటిలోనే తిరుగుతూ ప్రజలకు ఆహారం, కూరగాయలు, పండ్లు సరఫరా చేస్తున్నారు. ఇక ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఒకపక్క ముంపు ప్రాంతాలలో పర్యటనలు చేస్తూ, మరో పక్క కేంద్రంతో సంప్రదింపులు జరుపుదూ కేంద్ర సాయం జాప్యం లేకుండా వచ్చేలా చేస్తున్నారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో దుర్గ గుడి కిచెన్ లో లక్షల ఆహార పొట్లాలు తయారవుతున్నాయి. వండిన ఆహారం అయితే త్వరగా చెడిపోతుందని మార్కెటింగ్, వ్యవసాయ శాఖల ద్వారా లక్షల సంఖ్యలో యాపిల్స్ సేకరించారు. ఇక కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రాంమనోహర్ నాయుడు మొదటి రెండు రోజులు కంట్రోల్ రూమ్‌లో ఉండి వరద ముంపు ప్రాంతాల్లో అధికారులకు తగు సూచనలు చేస్తూ వచ్చారు. అదే సమయంలో చంద్రబాబు సూచనల మేరకు డ్రోన్ల ద్వారా బాధితులకు ఆహార పదార్థాలు అందించే విషయంలో సత్వర అనుమతులు వచ్చేలా చేశారు. మరో కేంద్ర మంత్రి తన నియోజకవర్గంలో వరద ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు అండగా నిలబడ్డారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగాఉన్న తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు ముంపు ప్రాంతాల్లో బాధితులకు ఆహారం, కూరగాయలు, పండ్లు సరఫరా చేయడంలో నిమగ్నమయ్యారు. మంత్రులంతా వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉంటే.. రాష్ట్రంలో సాధారణ పాలన పరిస్థితి ఏమిటి? అన్న అనుమానాలే ఎవరికీ కలగకుండా పాలన సాగింది. ఒక వైపు మంత్రులంతా వరద ముంపు ప్రాంతాలలో సహాయ పునరావాస కార్యక్రమాలలో నిమగ్నమై ఉన్న సమయంలో.. వరద ముంపులో ఉన్న విజయవాడలోనే వేదాంత కంపెనీ 83వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముంచుకొచ్చింది. ఈ కార్యక్రమానికి పెట్టుబడుల శాఖ మంత్రి హాజరయ్యారు. మరో మంత్రి ఢిల్లీలో మంత్రుల సదస్సులో ఉన్నాడు. రోజువారీ ప్రభుత్వలో జరగాల్సిన పనులన్నీ జరుగుతూనే ఉన్నాయి. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఏపీలో ప్రస్తుతం జరుగుతున్న పాలనను చూసి దేశం మొత్తం ఆశ్చర్యపోతుంది. ఇదీ ప్రభుత్వాన్ని నడిపించడం అంటే.. ఇదీ ప్రజల విషయంలో బాధ్యతగా ఉండడం అంటే.. ఇదీ ప్రజలకోసం పని చేయడం అంటే.. అంటూ దేశవ్యాప్తంగా ప్రముఖుల నుంచి, రాష్ట్ర ప్రజల నుంచి చంద్రబాబు, ఆయన టీంపై ప్రశంసల జల్లు కురుస్తోంది.

## అడగగానే ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు ఐఐహెచ్‌టీని మంజూరు చేశారు

మొదటి పేజి తరువాయి

నైపుణ్యం గల చేనేత కళాకారులు, నూతన ఆవిష్కరణల కోసం ఐఐహెచ్‌టీని ప్రారంభించినట్లు చెప్పారు.

ఐఐహెచ్‌టీని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ రాష్ట్రంలో చేనేత సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం మరియు అభివృద్ధికి ముందడుగు పడింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సంస్థ చేనేత సాంకేతికతలలో అధునాతన శిక్షణను అందిస్తుంది. దాంతో పాటు ఆధునిక సంప్రదాయ కళల సంరక్షణను కాపాడుతుంది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సాంస్కృతిక వారసత్వం మరియు ఆర్థిక వ్యవస్థలో చేనేత రంగానికి ఉన్న ప్రాధాన్యతను వివరించారు. విద్య మరియు నైపుణ్యాభివృద్ధి, వారి జీవనోపాధికి ప్రభుత్వం అందించే సహకారం గురించి సీఎం మాట్లాడారు. చేనేత పరిశ్రమ అభివృద్ధికి భరోసా ఇవ్వడం ద్వారా నేత కార్మికులు మరియు చేతివృత్తులపై రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతను కొనియాడారు. కొత్తగా ప్రారంభించిన ఇన్‌స్టిట్యూట్ చేనేత కమ్యూనిటీని బలోపేతం చేయడంలో మరియు రంగంలో ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. సీఎం మాట్లాడుతూ.. ప్రభుత్వం నేతన్నలకు అన్ని రకాలుగా ఆదుకుంటుందని చెప్పారు. ఈ సందర్భంగా నేతన్నకు చేయూత పథకం కింద 36,133 మంది లబ్ధిదారులకు రూ.290 కోట్ల నిధులను విడుదల చేశారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. చేనేత నైపుణ్యంలో శిక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఇప్పటివరకు దేశంలో కేవలం ఆరు ప్రాంతాల్లో మాత్రమే ఐఐహెచ్‌టీలు ఉన్నాయని. ఈ సంస్థ ఏర్పాటుతో ఏటా 60 మంది విద్యార్థులకు శిక్షణ సహకారం అందుతుందన్నారు. శిక్షణ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు చేనేత, టెక్స్‌టైల్స్‌లో డిప్లొమా సర్టిఫికేట్ లు అందజేస్తామని చెప్పారు. నాంపల్లిలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ అధికారులు, పరిశ్రమల నిపుణులు పాల్గొన్నారు.

## కీలక ప్రకటన.. 8 ముఖ్యాంశాలు

మొదటి పేజి తరువాయి

ఇల్లు, నివాసం ఏదీ కూల్చివేయడం లేదు. 2.ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లోకి వచ్చే కొత్త నిర్మాణాలు మాత్రమే కూల్చివేస్తాం. మాదాపూర్ సున్నం చెరువు, దుండిగల్‌లోని మల్లంపేట్ చెరువులో ఈ రోజు కూల్చిన నిర్మాణాలు నిర్మాణంలో ఉన్నాయి. ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లలో అనుమతి లేకుండా నిర్మిస్తున్నారు. 3.అమీన్‌పూర్‌లో కూల్చివేసిన నిర్మాణాలు.. ప్రధానంగా కాంపౌండ్ గోడలు, గదులు, షెడ్‌లు ఆక్రమణకు గురయ్యాయి. కాటసాని రాంభూపాల్ రెడ్డికి సంబంధించిన కొన్ని షెడ్లను కూల్చివేశాం. ఏ వ్యక్తి ఆక్రమించిన ఇల్లు, నివాసం కూల్చలేదు. 4.మల్లంపేట చెరువు, దుండిగల్‌లో కూల్చిన 7 విల్లాలు ఇప్పటికీ నిర్మాణంలో ఉన్నాయి. వాటిలో ఎవరూ లేరు. భవన నిర్మాణ అనుమతులు లేకుండా ఎఫ్‌టిఎల్‌లో ఉన్నాయి. బిల్డర్ విజయలక్ష్మి (స్థానికంగా లేడీ డాన్ అని పిలుస్తారు). ఆమెపై అనేక క్రిమినల్ కేసులు బుక్ అయ్యాయి. 5.సున్నం చెరువులోని నిర్మాణాలను గతంలో కూడా కూల్చివేశారు. కానీ.. వాటిని మళ్లీ తిరిగి నిర్మిస్తున్నారు. అందుకే వాటిని కూల్చివేశాం. 6.బిల్డర్ విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తదితరులపై స్థానిక పోలీస్ స్టేషన్లలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వారిపై చాలా ఫిర్యాదులు వచ్చాయి. 7.ఎవరి ఇళ్లు కూల్చబోమని హైదరాబాద్ ప్రజలందరికీ హామీ ఇస్తున్నాం. 8.ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న ఇల్లు, ఫ్లాట్, భూమిని కొనుగోలు చేయవద్దని ప్రజలను కోరుతున్నాము. అటువంటి ఆస్తుల కొనుగోలుదారులకు సంబంధించి ఏదైనా సందేహం ఉంటే.. వారు హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్‌ను గానీ.. అధికారులను గానీ సంప్రదించాలి.

## ప్రకాశం బ్యారేజీకి డ్యామేజి.. వైసీపీ కుట్ర కోణం ఉందన్న ఆరోపణలు..

మొదటి పేజి తరువాయి



వదర ప్రవాహం ప్రకాశం బ్యారేజీకి వచ్చింది. ఆ సమయంలో అంటే ఈ నెల 1న భారీ మరపడవలు ఆ వరద ప్రవాహంలో వచ్చి ప్రకాశం బ్యారేజీ గేట్లను బలంగా ఢీ కొన్నాయి. బ్యారేజీ నుంచి దిగువకు నీరు వెళ్లే మార్గంలో అడ్డంగా చిక్కుకున్నాయి. దీంతో వరద ప్రవాహం దిగువకు వెళ్లేందుకు ఆటంకం ఏర్పడింది. బ్యారేజీకి కూడా నష్టం వాటిల్లింది. బ్యారేజీ రెండు గేట్లకు ఉన్న కౌంటర్ వెయిట్లు ధ్వంసం అయ్యాయి. అప్పట్లోనే వరద నీటిలో ఒకే సారి నాలుగు బోట్లు కొట్టుకు రావడంపై అనుమానాలు వ్యక్తం అయ్యాయి. ఈ సంఘటన ప్రమాద వశాత్తూ జరిగింది కాదనీ.. ఎవరో ఉద్దేశపూర్వకంగా వదిలారనీ ఆరోపణలు సైతం వెల్లువెత్తాయి. గతంలో అంటే జగన్ హయాంలో కూడా ఇదే విధంగా వరద సమయంలో వరద ప్రవాహానికి అవరోధం కలిగి చంద్రబాబు నివాసం ముంపునకు గురయ్యేలా వైసీపీ ఓ బోటును అడ్డుగా పెట్టారన్న ఆరోపణలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ప్రకాశం బ్యారేజీ వద్ద వదర నీటిని అడ్డుకునేలా బోట్లు రావడంపై కూడా స్థానికులు నాటి ఘటనను గుర్తు చేస్తూ వైసీపీ కుట్ర కోణం ఉందన్న ఆరోపణలు చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు కూడా బోట్లు కొట్టుకురావడం వెనక కుట్రకోణం ఉందనే అంటున్నారు. ఒకేసారి నాలుగు బోట్లు కొట్టుకురావడం అనుమానాస్పదంగా ఉందని అంటున్న ఇరిగేషన్, రివర్ కన్జర్వేటివ్ శాఖల అధికారులు ఈ ఘటనపై విచారణ జరుపుతున్నారు. పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. నిండా ఇసుకతో ఉన్న మూడు బోట్లు వరద ప్రవాహానికి అడ్డంగా ప్రకాశం బ్యారేజీ గేట్లను ఢీకొన్న ఘటనపై ఒక పక్క పోలీసులు, మరో పక్క ఇరిగేషన్, రివర్ కన్జర్వేటివ్ శాఖల వేర్వేరుగా విచారణ జరుపుతున్నారు. ఇక ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం తగ్గడంతో ఆ బోట్లను తొలగించి ధ్వంసమైన రెండు గేట్ల కౌంటర్ వెయిట్ల స్థానంలో వేరేవి అమర్చే పనులు శర వేగంగా జరుగుతున్నాయి. అది వేరే సంగతి. అసలు ఒకే సారి నాలుగు బోట్లు వరద ప్రవాహంలో కొట్టుకు రావడం వెనుక ఉన్న కుట్ర కోణం ఏమిటి? వాటిని ఏ అవసరాల కోసం వాడుతున్నారు? వరద తీవ్రంగా ఉన్న సమయంలో ప్రవాహంలోనికి వాటిని ఎవరు వదిలేశారు? అన్నదానిపై దర్యాప్తు చేస్తున్నారు. ఇక ఆ బోట్లు మాజీ ఎంపీ నందిగం సురేష్ కు చెందినవని ప్రాథమికంగా తేలింది. ఆ బోట్లను ఇసుక రవాణా కోసం వాడుతున్నారని చెబుతున్నారు. దీంతో ఈ ఘటన వెనుక కుట్ర కోణంపై అనుమానాలు బలపడ్డాయి. కావాలనే బోట్లను ప్రకాశం బ్యారేజీ గేట్లను ఢీ కొట్టి భారీ నష్టం వాటిల్లితే.. ఆ నెపాన్ని తెలుగుదేశం కూటమి ప్రభుత్వంపై నెట్టి రాజకీయ లబ్ధి పొందాలన్న కుట్రతో ఉద్దేశపూర్వకంగానే వదిలేశారా అన్న కోణంలో దర్యాప్తు జరుగుతోంది.

## తెలుగు ప్రజల గుండెల్లో మరో బాంబు..

మొదటి పేజి తరువాయి

ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తూ కలెక్టర్ అంబేద్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. భారీ వర్షాల కారణంగా సోమవారం ఇతర జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించే అవకాశం ఉంది. తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలాగే శ్రీకాకుళం, పార్వతీపురం, అల్లూరి జిల్లాలకు సోమవారం సెలవు ప్రకటిస్తూ కలెక్టర్లు ఉత్తర్వులు జారీ చేశారు. వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం పశ్చిమ-వాయువ్య దిశగా పయనించినట్లు వాతావరణ శాఖ తెలిపింది. సెప్టెంబరు 8వ తేదీ ఉదయం 08.30 గంటలకు కళింగపట్నానికి తూర్పున 280 కి.మీ, గోపాలపూర్ (ఒడిశా)కి తూర్పు ఆగ్నేయంగా 230 కి.మీ., పరదీప్ (ఒడిశా)కి 260 కి.మీ. దక్షిణ-ఆగ్నేయంగా, తుఫాను దీఘా (పశ్చిమ బెంగాల్)కి దక్షిణంగా 390 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. వాయుగుండం దాదాపు ఉత్తరం వైపుగా ఉత్తర ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీరాల వైపు కదులుతుందని, రానున్న 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందన్నారు. సెప్టెంబరు 9 సాయంత్రం లేదా రాత్రి పశ్చిమ వాయువ్య దిశగా పయనించి ఒడిశాలోని పూరీ, పశ్చిమ బెంగాల్‌కు ఆనుకుని ఉన్న దిఘా మధ్య తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. తుపాను ప్రభావంతో తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు, గరిష్ఠంగా 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించారు. కాకినాడ, గంగవరం, కళింగపట్నం, భీమునిపట్నం ఓడరేవులకు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మూడు రోజులు కుండపోత వర్షాలు కురుస్తాయని తెలిపింది. రేపు ఐదు జిల్లాలకు, ఎల్లుండి నాలుగు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం రేపు వాయుగుండంగా మారే అవకాశం ఉందని తెలిపింది. ఇది మూడు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని పేర్కొంది. భద్రాద్రి, ఖమ్మం, భూపాలపల్లి, మహబూబాబాద్, మెదక్, ములుగు, సూర్యాపేట జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని సూచించింది.

హైదరాబాద్ వాసులు జర జాగ్రత్త

నిర్మల్, నల్గొండ, నిజామాబాద్, సిరిసిల్ల, రంగారెడ్డి, ఆదిలాబాద్, కామారెడ్డి, కరీంనగర్, మంచిర్యాల, సంగారెడ్డి, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ఇటు హైదరాబాద్‌లో రేపు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. దీంతోపాటు హైదరాబాద్ వాసులు ఏ క్షణమైనా ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. మరోవైపు హైదరాబాద్ జంట జలాశయాలు ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ లో వరద నీటిని మూసీలోకి వదిలారు. దీంతో నది పరిసర ప్రాంతాల ప్రజలను ప్రభుత్వం అప్రమత్తం చేసింది.

మున్నేరు విలయతాండవం

ఖమ్మం జిల్లాలో మున్నేరు వాగు విలయతాండవం చేసింది. పరివాహక ప్రాంతాలను ముంచేసింది. భారీ వరదలతో మహబూబాబాద్ ప్రాంతంలో రైల్వే ట్రాక్ కొట్టుకుపోయింది. మరోసారి భారీ వర్షాలు కురిస్తాయని వాతావరణ శాఖ చెప్పడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఖమ్మంలో వరదలు కారణంగా పాఠశాలలకు ఐదు రోజులు సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. రేపు అంటే సోమవారం కూడా ఖమ్మంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో పాటుగా మున్నేరుకు మరింత వరద నీరు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం స్కూళ్లకి సెలవు ప్రకటించారు. కాగా మున్నేరు పరివాహక ప్రాంతంలోని ఖమ్మం మున్సిపాలిటీ పరిధిలోని, ఖమ్మం రూరల్ మండలంలోని అన్ని విద్యాసంస్థలకు ఆ జిల్లా కలెక్టర్ రేపు సెలవు ప్రకటించారు. జిల్లాలోని మిగిలిన మండలాలలోని విద్యాసంస్థలు రేపటి నుండి యథావిధిగా పనిచేయాలని ఆదేశాలు జారీ చేశారు.

## జర్నలిస్టులకు ఫ్యూచర్ సిటీలో ఇళ్ల స్థలాలు

ఆనాడు వైఎస్ఆర్ నిర్ణయం తీసుకున్నారని వ్యాఖ్యానించారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో నిర్ణయం తీసుకోవడానికి ఎలాంటి శషబిషలు లేవని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సమస్యకు తమ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిస్తోందని భరోసా ఇచ్చారు. 'వృత్తిపరమైన గౌరవాన్ని ఎవరూ పెంచరు. అది మనకు మనమే పెంచుకోవాలి. ప్రజాభిప్రాయం, జర్నలిస్టుల సూచనలతో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతోంది. వ్యవస్థలపై నమ్మకం పెంచాలన్నదే మా ప్రభుత్వ విధానం. జర్నలిజం కూడా వ్యవస్థల్లో ఒక భాగమే. ఆనాడు రాజకీయ పార్టీలు సిద్ధాంత భావజాల వ్యాప్తి కోసమే పత్రికలు ఏర్పాటు చేసుకునేవి. కానీ ఈరోజుల్లో ఉన్మాద ధోరణితో వ్యవహరించే పరిస్థితులు దాపురించాయి' అని రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. కొందరు చేసే పనులతో జర్నలిస్టులందరికీ చెడ్డపేరు వస్తోంది. కొంతమంది జర్నలిస్టు పదం అర్థాన్నే మార్చేస్తున్నారు. అలాంటి వారిని నియంత్రించే బాధ్యత మీపైనే ఉంది. నిజమైన జర్నలిస్టులకు ఎలాంటి నష్టం జరగకుండా చూసుకునే బాధ్యత మా ప్రభుత్వానిది. భాష విషయంలోనూ కొన్ని పత్రికలు గీత దాటుతున్నాయి. ముఖ్యమంత్రి హోదానూ అవమానపరిచేలా వ్యవహరిస్తున్నారు. కేవలం రాజకీయ పార్టీల యజమానులను రక్షించేందుకే వారు ప్రాధాన్యతనిస్తున్నారు' అని సీఎం రేవంత్ రెడ్డి ఆక్షేపించారు. అలాంటి వారిపై తీసుకునే చర్యలను నిజమైన జర్నలిస్టులు ఆపాదించుకోవద్దు. నిజమైన జర్నలిస్టులను కాపాడుకోవాల్సిన బాధ్యత మీపైనే ఉంది. ఆరోగ్య భద్రత కార్డులు, అక్రిడేషన్ ఇతర సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం.. మీడియా అకాడమీ కొత్త విధి విధానాలు తయారు చేయాలని ఆదేశిస్తున్నా. వాటికి కేబినెట్ ఆమోదం తెలిపే బాధ్యత మేం తీసుకుంటాం' అని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. 'తెలంగాణకు టూరిజం, ఎనర్జీ, స్పోర్ట్స్ పాలసీలు లేవు. గత పదేళ్లుగా తెలంగాణకు అసలు పాలసీలే లేవు. మేం మీలో ఒకరమే.. మీ సమస్యలు పరిష్కరించే బాధ్యత మాదే. మీడియా అకాడమీకి స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ నుంచి రూ.10 కోట్లు ఇస్తున్నా. ఇళ్ల స్థలాల విషయంలో ఎవరూ ఆందోళన చెందొద్దు. అర్హులైన వారిని ఫ్యూచర్ సిటీలో భాగస్వాములను చేస్తాం. ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో మనందరం భాగస్వాములమవుదాం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## తీవ్ర విషాదం.. వాగు-రోడ్డు మధ్య వేలాడుతున్న ఆర్టీసీ బస్సు..

### ఆర్తనాదాలు చేస్తున్న ప్రయాణికులు

అల్లూరి సీతారామరాజుజిల్లా : ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా బోరన్నగూడెంలో ఆర్టీసీ బస్సు రోడ్డు ప్రమాదానికి గురైంది. ఏపీలో పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికులతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి వాగులోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 50 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే.. ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టింది. అనంతరం ఆ బస్సు వాగువైపునకు దూసుకెళ్లింది. బస్సు పూర్తిగా ఒకవైపునకు చెట్ల మధ్య ఒరిగింది. ప్రమాద సమయంలో బస్సులో 50 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. అందులో 20 మంది వరకు ప్రయాణికులకు తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న స్థానికులు, పలువురు అధికారులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బస్సులో నుంచి ప్రయాణికులను బయకు తీశారు. అనంతరం క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు రాజమండ్రి నుంచి నర్సీపట్నం వెళ్తున్నట్లు గుర్తించారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక
మంగళవారం - 10 - సెప్టెంబర్- 2024

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య





టేకులపల్లి (గౌతమ్ న్యూస్): టేకులపల్లి మండల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు లబ్ధిదారులకు పంపిణి చేసిన ఇల్లందు నియోజకవర్గం శాసనసభ్యులు కోరం కనకయ్య, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 68 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పేదల పాలిట వరమన్నారు, ఎమ్మెల్యే గారి చేతుల మీదుగా చెక్కులను తీసుకున్న పేద కుటుంబాలు కళ్ళల్లో ఆనంద భాష్పాలు వికసించాయి ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కోరం ఉమా సురేందర్, మండల అధ్యక్షులు భూక్యా దేవా నాయక్, ముఖ్య నాయకులు ఇస్లావత్ రెడ్యానాయక్, శివ, ఈది గణేష్, బోడ మంగీలాల్ నాయక్, మోకాళ్ళ పోశాల్, బోడ సరిత, మధు రెడ్డి, లక్కినేని శ్యామ్ బాబు, సంజయ్, రవి, బండ్ల రజిని, శ్రీనివాస్, అజ్మీర శివ ,బొడ్డు అశోక్, చందర్ సింగ్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



## మార్క్సిస్టు మహోపాధ్యాయుడు విప్లవ జోహార్లు

### 48 వ వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎంఎల్) ఎన్డి నివాళి!!



టేకులపల్లి (గౌతమ్ న్యూస్): పీడిత ప్రజల రాజ్య స్థాపనే ధ్యేయంగా పోరాడి చైనాలో సోషలిస్టు రాజ్యాన్ని ఏర్పాటు చేసిన జనచైన నేత చైనా కమ్యూనిస్టు పార్టీ చైర్మన్ కామ్రేడ్ మావోకు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ తరఫున విప్లవ జోహార్లు అర్పిస్తున్నట్లు ఆ పార్టీ టేకులపల్లి మండల కార్య దర్శి కామ్రేడ్ భూక్య హర్ష్య అన్నారు. కామ్రేడ్ మావో మరణించి 48 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా మావో చిత్రపటానికి పూలమాల వేసి టేకులపల్లి మండల కేంద్రంలో నివాళు అర్పించారు .ఈ సందర్భంగా నోమల భానుచందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి హర్ష్య మాట్లాడుతూ, వ్యవసాయక దేశమైన చైనాలో విప్లవపార్టీ నాయకత్వంలో ప్రజాయుద్ధపంథా ద్వారా సోషలిస్టు రాజ్యాన్ని 1949 లో కామ్రేడ్ మావో సాధించారని ఆయన వివరించారు. భారతదేశం కన్నా రెండు సంవత్సరాల వెనుక విప్లవాన్ని సాధించినప్పటికీ చైనా నేడు ప్రపంచంలో అగ్రదేశంగా అభి వృద్ధి చెందిన దేశంగా నిలిచిందన్నారు, భారతదేశం వ్యవసాయక దేశం అయినందున అ భూస్వామ్య వ్యవస్థను నిర్మూలించి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని సాధించేందుకు కామ్రేడ్ మావో చూపిన ప్రజాయుద్ధ పంథా లో విప్లవోద్యమం సాగుతుందని ఆయన వివరించారు. మావో చూపిన విప్లవబాట వెనకబడిన దేశాలన్నింటికీ ఆదర్శంగా అనుచర నీయంగా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నోముల భానుచందర్ ,తోటకూరి. సతీష్, వీర్య, బాదవత్ ఈరియా, ధరావత్ బిక్ష, శంకర్, మంచ, బోడ లింబ, శంకర్, భీముడు, రమేష్ తదితరులు పాల్గొన్నా రు.

## ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా పండ్లు బిస్కెట్లు పంపిణీ



టేకులపల్లి (గౌతమ్ న్యూస్): ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య పుట్టినరోజు సందర్భంగా డీసీసీబీ బ్యాంకు డైరెక్టర్ లక్కినేని శ్యాంబాబు ముత్యాలంపాడు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్కినేని మురళీ, అప్పికట్ల హనుమంతరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి . రామచంద్రసింగ్ మరియు ఉపాధ్యాలము పిల్లలు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య.

### బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన సొసైటీ చైర్మన్ మూల మధూకర్ రెడ్డి.



బయ్యారం, (గౌతమ్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని గౌరారం గ్రామపంచాయితీ పరిధిలో గత వారం రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు గౌరారం, కోడిపుంజులతండలో తుఫాను దాటికి ఇండ్లు కూలడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఇల్లందు ఎంఎల్ఏ కోరం కనకయ్య వారి ఆదేశాల మేరకు బయ్యారం రైతు సహకార సంఘం చైర్మన్ మూల మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం బియ్యం నిత్యావసర సరుకులు అందించడం జరిగింది. అలాగే ఎంఎల్ఏ గారితో మాట్లాడి వారికి తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా నిత్యావసర వస్తువులు అందించిన దాతలకు ధన్యవాదాలు తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాందాటి శ్రీనివాస్,తాడబోయిన ప్రభాకర్ యాదవ్,వట్టం సాంభశివరావు,శ్రీ పతి ఉపేందర్, కోడి బుచ్చయ్య,కేశోజు నవీన్,అఖిల్,కొడిపుంజులతండ,గౌరారం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





## టిపిసిసి అధ్యక్షుడికి సన్మానం



మెట్ పల్లి (గౌతమ్ న్యూస్): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన భూమా మహేష్ కుమార్ గౌడ్ కు టిపిసిసి డెలిగేట్ మెంబర్ కల్వకుంట్ల సుజీత్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుతుబోద్దీన్ పాషా కాంగ్రెస్ సీనియర్ నాయకులు వాకిట్ సత్యం రెడ్డి కూన గోవర్ధన్ రుత్త నారాయణ కొమ్ముల చిన్నారెడ్డి అందే మారుతి గణేష్ గౌడ్ మహేష్ మురళి శ్రీకాంత్ గిరిధర్ మొగిలి రాజేందర్ మహబూబ్ గంగాధర్ జాఫర్ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం హైదరాబాద్ లోని మహేష్ గౌడ్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

# కాళోజీ జీవితం స్ఫూర్తిదాయకం

### జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం కలెక్టరేట్ : ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలను సోమవారం జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్ర పటానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ యాసకు కాళోజీ నారాయణరావు చేసిన సేవలు కొనియాడారు. 'హింస తప్పు, రాజ్యహింస మరీ తప్పు' అంటూ 'సామాన్యుడే నా దేవుడు' అని ప్రకటించిన మహోన్నత వ్యక్తి కాళోజీ అని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యునిగా 1958 నుంచి 1960 వరకు పనిచేశారని, రెండేండ్లు ఏ పార్టీకి చెందని స్వతంత్ర సభ్యుడిగా కొనసాగారని అన్నారు. కాళోజీ 'ఆంధ్ర సారస్వత పరిషత్' వ్యవస్థాపక సభ్యుడుగా, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీలో సభ్యుడుగాను పనిచేశారని అన్నారు. తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షునిగానూ, 1957%-%-61 కాలంలో గ్లోసరీ కమిటీ సభ్యుడిగానూ ఉన్నారని చెప్పారు. 1977లో సత్తుపల్లి (ఖమ్మం జిల్లా) నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావుపై పోటీ చేసి ఓడిపోయారని గుర్తుకు చేశారు. కాళోజి సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 1992లో ఆయనకు పద్మ విభూషణ్ అవార్డును అందజేసింది అన్నారు.ప్రజాపక్షంగా నిలిచి ధిక్కారమే జీవితంగా స్ఫూర్తివంతమైన జీవితాన్ని గడిపిన మానవతావాది కాళోజీ అని కొనియాడారు. పుట్టుక.. చావుల మధ్య బతుకంతా తెలంగాణ కోసమే అర్పించిన అక్షర తపస్వి కాళోజీ అని కీర్తించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న కాళోజీ పుట్టినరోజైన సెప్టెంబరు 9 ని తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఇందిర, పరిపాలన అధికారి గన్యా, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, ఉద్యానవన శాఖ అధికారి సూర్యనారాయణ, డి సి ఓ సయ్యద్ హుర్షీద్, ఉప కోశాధికారి వెంకటేశ్వర్లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణి కార్పొరేట్ ఏరియా డబ్ల్యూపిఎస్ - జి ఏ ఆధ్వర్యంలో డిపార్ట్మెంటల్ క్రీడలను ప్రారంభించిన

### జిఎం పర్సనల్ ,వెల్ఫేర్ అండ్ ఆర్సి పి.సామ్యూల్ సుధాకర్.




భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సర వార్షిక క్రీడలను ఈరోజు కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జిఎం (సెక్యూరిటీ) కె.శ్రీనివాస రావు అధ్యక్షునిగా మరియు ముఖ్య అతిథిగా జిఎం(పర్సనల్) పి .సామ్యూల్ సుధాకర్ హాజరయి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ క్రీడాకారుల కోసం సుశిక్షితులైన కోచ్ లతో కోచింగ్ క్యాంప్ లను నిర్వహిస్తు క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తుందని, ఇందులో మంచి క్రీడా ప్రతిభతో స్నేహభావంతో క్రీడలలో రాణించాలని, క్రీడలు అనేవి శారీరక దృఢత్వానికి, ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఉద్యోగులు తమ తమ పనులను నిర్వహిస్తూనే క్రీడలలో ఆసక్తి చూపడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ క్రీడలలో సీనియర్ క్రీడాకారులతో పాటు యువ ఉద్యోగులు ఎక్కువగా పాల్గొనేలా ప్రోత్సహించి కోల్ ఇండియా స్థాయి పోటీలలో మన సంస్థ మరిన్ని పతకాలు సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. లేడీస్ క్లబ్ నందు ఇండోర్ ఆటలయిన చేస్, బిలియర్డ్స్, టేబుల్ టెన్నిస్, టేబుల్ హాకీ లాంటి వినూత్న ఆటల ను ప్రోత్సహించటం ద్వారా మహిళా ఉద్యోగులలో పాటు ఉద్యోగుల మహిళా కుటుంబసభ్యులు కూడా ఆకర్షితులై వారు కుటుంబ బాధ్యతలతో పాటు క్రీడలను కూడా వారి దైనందిన జీవితం లో ఒక భాగం చేసుకుంటారని తెలిపారు.ఇందులో భాగంగా మొదటి ఆట గా వాలీబాల్ మ్యాచ్ ను హెడ్డాఫీస్ వర్సెస్ ఎస్-పిసి డిపార్ట్ మెంట్ జట్ల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిఎం (పర్సనల్) వెల్ఫేర్ - ఆర్సి పి. సామ్యూల్ సుధాకర్, జిఎం(సెక్యూరిటీ) కే.శ్రీనివాస రావు, కార్పొరేట్ సిఎంఓఏఐ ప్రతినిధి ఆర్. కేశవ రావు, గుర్తింపు సంఘం (ఏఐటియుసి) ప్రతినిధి పి. నితిన్ కుమార్, ప్రాతినిధ్య సంఘం (ఐఎన్ టి యు సి) ప్రతినిధి సిహెచ్. మహేష్ , కమ్యునికేషన్ - హనరరీ సెక్రటరీ టి. శ్రీనివాస రావు, స్పోర్ట్స్ సూపర్ వైజర్ ఎంసి. పోస్ నెట్, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ ఏవి.రమేశ్, వాలీబాల్ కెప్టెన్ రాజ శేఖర్, వాలీబాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# రుణమాఫీలో పచ్చి మోసం!!

### మైలారం రైతు నాగన్న ఆరోపణ

### నిధులు లేక నిలిచిపోయిన రుణమాఫీ!!



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో పంట రుణమాఫీ పైన ప్రభుత్వం మోసపూరితమైన ప్రకటనలు విధానాలు అవలంబిస్తుందని కోడేరు మండలం మైలారం గ్రామానికి చెందిన మిద్దె నాగన్న ఆవేదన వ్యక్తం చేశారు, తన పేరు పైన భూమి ఉన్నప్పటికీ రుణమాఫీలో ఒక లక్షా 12 వేల రూపాయలు మాఫీ వచ్చిందని ప్రభుత్వం తన పేరును ప్రకటించింది కానీ తీరా చూస్తే రుణమాఫీలో తమకు రుణమాఫీ కాలేదని ఆయన ఆవేదన చేశారు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకంలో, ఏ నాగన్న పేరు ఉన్నప్పటికీ పట్టాదార్ పాస్ పుస్తకంలో మిద్దె నాగన్న అనే పేరు ఉన్నందువల్ల రుణమాఫీ చేయలేదని సంబంధిత కోడేరు మండల అగ్రికల్చర్ ఆఫీసర్లు పేర్కొన్నారు, ఇది ఎంతవరకు నిజం పేరు తప్పుంటే రుణమాఫీ వర్తించదా, ఒకవేళ పేరు తప్పుంటే సరి చేసే బాధ్యత ప్రభుత్వానికి లేదా, అంటూ నాగన్న ఆవేదన వ్యక్తం చేశారు, రుణమాఫీలో అసలు విషయం ప్రభుత్వం దగ్గర నిధులు లేక మాఫీ చేయలేక చేతగాని ప్రభుత్వం దొంగ తిరుడు దొంగ మాటలు మాట్లాడుతూ పబ్బం గడపకుటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు, తన పేరు విన భూమి ఉన్నప్పటికీ ఎందుకు రుణమాఫీ కాలేదు. సంబంధిత మంత్రి కొల్లాపూర్ తాలూకా జూపల్లి కృష్ణారావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు, ఈ విషయం పైన ఎంతవరకు అయినా పోరాటం చేయక తప్పదని రుణమాఫీలో జరుగుతున్నటువంటి మోసం ఇప్పటికే ప్రతిపక్ష టిఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టి రైతులను చైతన్యం చేయడం జరిగిందని ఇప్పటికైనా ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని రుణమాఫీలో చిన్నచిన్న పొరపాటుతో సరిచేసి అందరికి రుణమాఫీ చేయాలని మైలారం గ్రామానికి చెందిన నాగన్న డిమాండ్ చేశారు, రుణమాఫీలో మోసం జరుగుతున్నది వాస్తవం దీనికి ప్రత్యక్ష సాక్ష్యం రైతుల పేర్లు తక్కువ ఉన్నాయని ప్రభుత్వం కాలయాపన చేయడానికి కుట్ర ఉందని అసలు విషయం బయట పెట్టకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రకటనలు అప్పుడు హామీలను ఇస్తుందని నాగన్న వ్యక్తం చేశారు, కాంగ్రెస్ ప్రభుత్వం దగ్గర నిధులు లేక చేతగాని హామీలు ఆరు గ్యారెంటీ ఉచిత హామీలు తోపాటు రైతు భరోసా నిధులు ఎందుకు విడుదల చేయలేదని ఆయన ప్రశ్నించారు, అసలైన విషయం ప్రజలకు తెలవదు ఇప్పటికైనా ప్రజలు చైతన్యం కావాలని నాగన్న పిలుపు నిచ్చారు, రుణమాఫీ విషయం లో కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చే స్థానిక ఎన్నికల్లో ఒక సీటు కూడా రాదని ఆయన చెప్పారు,



## ఏఐటియుసికి గుర్తింపు పత్రం అందజేసిన సింగరేణి యాజమాన్యం

### సమస్యల పరిష్కారంకోసం అన్నిస్థాయిల్లో చర్చలు జరపాలి.

### గుర్తింపు కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు, ఎమ్మెల్యే కూనంనేని, వాసిరెడ్డి, రాజ్ కుమార్.




భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : సింగరేణి సంస్థలోగుర్తింపు సంఘం ఎన్నికలు జరిగిన ఎనిమిది నెలల తర్వాత యాజమాన్యం ఎట్టకేలకు గుర్తింపు సంఘంగా గెలుపొందిన ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధి బృందానికి గుర్తింపు పత్రాన్ని అందించింది. సోమవారం హైదరాబాద్ సింగరేణి భవన్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గుర్తింపు పత్రాన్ని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో పాటు యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ లకు సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం అందజేశారు. గుర్తింపుపత్రం అందించిన అనంతరం కూనంనేని మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఏఐటియుసికి గుర్తింపు పత్రం ఇవ్వడంతో భాధ్యత తీరినట్లు కాకుండా కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం గుర్తింపు సంఘంతో అన్ని స్థాయిల్లో సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఐటియుసి కేంద్ర కమిటీ నాయకులు వై.వి.రావు, కె. సారయ్య, వంగ వెంకట్, గనిగల వీరస్వామి, కె.వి.రమణమూర్తి, ఎల్ ప్రకాశ్, కే.స్వామి, కందుకూరి రాజారత్నం, ఆరెల్లి పోషం, ఎం.సమ్మయ్య, సముద్రాల సుధాకర్ , రామ్ గోపాల్ పదకొండు ఏరియాల సెంట్రల్ ఆఫీస్ బేరర్సుతో పాటు బ్రాంచి కార్యదర్శులు పాల్గొన్నారు.

## పేదలకు ఏకష్టం వచ్చినా ఆదుకుంటాం

### ఉలవనూర్ కిన్నెరసాని ముంపుబాధితులకు సీపీఐ ఆధ్వర్యంలో రూ.2లక్షల విలువచేసే నిత్యావసరాలు పంపిణీ

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా.




భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): పాల్వంచ : పేదలకు ఏ కష్టం వచ్చినా సిపిఐగా ఆదుకుంటామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఉలవనూర్, కిన్నెరసాని గ్రామాల్లో 60 కుటుంబాలు వరద వంపుకు గురికాగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచనలతో రూ 2లక్షల విలువ చేసే నిత్యవసర వస్తువులు దుస్తులు సిపిఐ ఆధ్వర్యంలో ఉలవనూర్, కిన్నెరసాని గ్రామాలలో బాధితులకు సోమవారం అందజేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితుల కష్టాలు తీరేంతవరకు వెన్నంటే ఉంటామని ప్రజలకు భరోసా కల్పించారు. స్థానిక శాసనసభ్యులు కూనంనేని ముంపు సమస్య శాశ్వత పరిష్కారం కోసం కార్యాచరణ రూపొందించారని అతి త్వరలో భద్రత పనులు మొదలవుతాయని తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఉలవనూర్, కిన్నెరసాని గ్రామాల్లో వరదలు కారణంగా 60 కుటుంబాలు సర్వం కోల్పోయారని వారిని ఆదుకోవటానికి స్వచ్ఛంద సేవాసంస్థలు, దాతలు సేవా దృక్పథంతో స్పందించి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబా, జిల్లా సమితి సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, వి పద్మజ, నాయకులు ముత్యాల కిరణ్ కుమార్, శనగరపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, మన్నెం వెంకన్న, వేములపల్లి శ్రీను, వైస్ గిరి, ఉప్పుశెట్టి రాకేష్, బుక్య విజయ్, వేములపల్లి రాజశేఖర్, ఆదినారాయణ, సత్యనారయణ, అప్పారావు, ఖాసీం, పురుషోత్తం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## శివ్వంపేట మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా
## సీనియర్ జర్నలిస్ట్ అబ్దుల్ అజీజ్ ఏకగ్రీవ ఎన్నిక



నర్సాపూర్ (గౌతమ్ న్యూస్): తమపై నమ్మకంతో ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా ఎన్నుకున్న సభ్యుల నమ్మ కాని వమ్ము చేయాకుండా జర్నలిస్టుల అభివృద్ధికి కట్టుబడి ఉంటానని ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా నూతన ఎన్నికైన అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ని ఓ ఫంక్షన్ హాల్ లో అదివారం శివ్వంపేట మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా అబ్దుల్ అజీజ్, ప్రధాన కార్యదర్శిగా గోవిందరాజ్ చారి, గౌరవఅధ్యక్షుల వెంకటేష్, ఉపాధ్యక్షునిగా బి.నర్సింలు గౌడ్, కార్యదర్శిలు గా ఆర్ నగేష్, కోండ సంపత్ కుమార్ చారి, ఎస్ వేంకటేష్,కోశాధికారిగా షబ్బీర్ ప్రచార కార్యదర్శిగా ఆనంద్, సలహాదారులుగా డి, సంతోష్, కే.సత్యనారాయణ గౌడ్ కార్యవర్గ సభ్యులుగా గణేష్ కుమార్ చారి, ఏం డీ ఖదీర్,బాలు నాయక్,ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సందర్భంగా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ జర్నలిస్టులకు అందుబాటులో ఉంటూ వారి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు పద్మ చారి, ఆర్.శ్రీకాంత్, పి.సందీప్, ప్రవీణ్ వెంకటేష్ ఎన్నికయ్యారు.

## శివంపేట మండలంలో టి పి టి ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం!
### మండల బాధ్యులు సంతోష్ కుమార్ , నారాయణ గౌడ్.!!



నర్సాపూర్ (గౌతమ్ న్యూస్): శివంపేట మండల కేంద్రంలో టి పి టి ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్ర కౌన్సిలర్ రాజేంద్రప్రసాద్ మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. శివంపేట మండల బాధ్యతలను వరిగంటి సంతోష్ కుమార్ గుప్తా కు నారాయణ గౌడ్ కు మరియు ఎం సింహంకు మండల బాధ్యతలు అప్పగించారు. అనంతరం టి పి టి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి మరియు రాష్ట్ర కౌన్సిలర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయులకువెంటనే పెండింగ్ డి ఏ లను విడుదల చేయాలని మరియు సిపిఎస్ రద్దు చేయాలని అదేవిధంగా 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని టి పి టి ఎఫ్ తరఫున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## హిందూ పండుగలు ఐక్యమత్యానికి త్యాగానికి వేదికగా నిలవాలి
### సిపిఐ యువజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బరిగెల భూపేష్



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : భారత్ దేశ సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ప్రపంచ దేశాలకి ఆదర్శమని, హిందూ పండుగలు ఐక్యమత్యానికి త్యాగానికి వేదికగా నిలవాలని సిపిఐ యువజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బరిగెల భూపేష్ అన్నారు. అదేవిధంగా సెప్టెంబర్ 11న బుధవారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని సింగరేణి కార్మిక ప్రాంతం చుంచుపల్లి మండలం శ్రీ ఇంక్లైన్ గ్రామ పంచాయితీ బేరియం బస్టాండ్ నందు" శ్రీ లక్ష్మీ గణపతి"ఆలయం నందు నవరాత్రి మహోత్సవములు సందర్భంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పుక్కల్ల ధనరాజ్,దొమ్మేటి రామకృష్ణ, గుత్తుల ఆనంద్, వాసంశెట్టి పూర్ణ , ఇల్లమెల్లి ఆదినారాయణ, కందుకూరి నాగమోహన్,గిడ్డి శ్యామ్ ,బానోత్ రవి, ఎడ్ల రమేష్,కట్ట వీరం బాబు, బట్టు నరేష్,గుత్తుల అనంత్, శ్రీశాంత్,ఆసంపెల్లి రమేష్, శశి తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ అధ్యక్షునికి అభినందనలు తెలిపి
# ఘనంగా సన్మానం చేసిన
### మండల కాంగ్రెస్ నాయకులు నవీన్ గుప్తా



నర్సాపూర్ (గౌతమ్ న్యూస్): తెలంగాణ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షులు గా నియామకమైన మహేష్ కుమార్ గౌడ్ ను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ టైగర్ మైనంపల్లి హనుమంతరావు గృహంలో నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి గారు మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ గార్ల తో కలిసి అభినందనలు తెలియజేసిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నవీన్ గుప్తా ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి బండారి గంగాధర్ కరుణాకర్ రెడ్డి మాధవరెడ్డి లక్ష్మీ కాంతారావు నారా గౌడ్ వెంకట్ రెడ్డి వేణుగోపాల్ రెడ్డి బాసంపల్లి శ్రీనివాస్ గౌడ్ వారాల గణేష్ వివిధ గ్రామ శాఖ అధ్యక్షులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

## నల్లబ్యాడ్జీలు ధరించి మధ్యాహ్నా భోజన కార్మికుల నిరసన
### ఎన్నికల మేనిఫెస్టో హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలి.
### వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సత్తెనపల్లి విజయలక్ష్మి.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : కాంగ్రెస్ తమ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన రూ.10వేల వేతన హామీని అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ అనుబంధ మిడ్డే మీల్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన అనంతరం పనులు ముగించుకున్న అనంతరం ఏంఈఓలకు డిమాండ్ల వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయి అధికారం చేపట్టి తొమ్మిదినెలకు గడుస్తున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు మేనిఫెస్టోలో పేర్కొన్న రూ.10వేల గౌరవ వేతనం అమలుచేయడం లేదన్నారు. పాఠశాలల్లో వంటా వార్పు పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించి కార్మికులకు అన్యాయం చేసేందుకు కుట్ర చేస్తోందని, ఈ ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని, బకాయి బిల్లులు తక్షణమే విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్వప్న, అరుణ, రమణ, శ్రీలత, కవిత, దేవి, మాడిశెట్టి పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సేవాలాల్ సేన 10వ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న
### రాష్ట్ర కో కన్వీనర్ సేవాలాల్ వెంకన్న నాయక్



మానుకోట జిల్లా (గౌతమ్ న్యూస్): మానుకోట జిల్లా శనిగపురం గ్రామంలోని సేవాలాల్ గుడి వద్ద ఘనంగా సేవాలాల్ సేన 10 వ ఆవిర్భావ దినోత్సవ వేడుక, జెండా ఆవిష్కరణ నిర్వహించారు. మొదట మేరమా యాడి కి, సేవా లాల్ మహారాజ్ కి పూజలు నిర్వహించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు గుగులోత్ నందులాల్ నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన రాష్ట్ర కో కన్వీనర్ సేవాలాల్ వెంకన్న నాయక్ జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం మాట్లాడుతూ 2015 సెప్టెంబర్ 9 న బంజారా గురువు తపస్వి రామ్ రావ్ మహారాజ్ చేతుల మీదుగా భూక్యా సంజీవ్ నాయక్ వ్యవస్థాపక అధ్యక్షులు గా ఏర్పడిన సేవాలాల్ సేన నాటి నుండి నేటి వరకు సాధించిన కొన్ని విజయాలు తండాలను ప్రత్యేక పంచాయతీలుగా సాదించినం. పది శాతం రిజర్వేషన్ సాదించినం. పోడు భూములకు పట్టాల కోసం 'పొడుకు-తోడు 'పాదయాత్ర ఉద్యమాలతో సాధించుకున్నాం. జాతి మొత్తమే కాదు సమాజం మొత్తం "జై సేవాలాల్ " అనేలా కృషి చేసి ప్రభుత్వం అధికారికంగా జరిపేలా కృషి చేసినం. 2012 ఏజెన్సీ డిఎస్సి ఉద్యోగాలు ఇప్పించాం మరియు 2017 టీఆర్టీ ఉద్యోగాలు ఇప్పించాం. ముంపు మండల ఉద్యోగులను స్వంత రాష్ట్రానికి రావడానికి కారణం సేవాలాల్ సేన కృషి ఫలితం. జాతి నాయక్ కరోబర్ మన సంస్కృతి సంప్రదాయాల వివాహాలు ప్రోత్సహించడం మన ఆడబిడ్డల పండుగ అయినా తీజ్ ను ట్యాంక్ బండ్ మీద చేసి జాతి మొత్తం తీజ్ పండుగ జరుపుకునేలా కృషి చేసినం. ధర్మజాగరణ అధ్వర్యంలో సేవాలాల్ మహారాజ్ మరియు మేరమ్మ (జగదాంబ ఆలయాలు )నిర్మాణాలకు కృషి చేసినం. హైద్రాబాద్ నడిబొడ్డులో సుందరయ్య కేంద్రం బాగ్ లింగంపల్లి లో లంబాడి బస్తి (కళ్యాణ్ నాయక్ - హుబా నాయక్ )డబుల్ బెడ్ రూమ్ ఏర్పటు మరియు వనస్థలిపురం మార్కెట్ వద్ద డబుల్ బెడ్ రూమ్ లను బంజారా బిడ్డలకు ఇప్పించిన చరిత్ర సేవాలాల్ సేన దే. నిరుద్యోగుల తరుపున గ్రూప్ 2వాయిదా వేయించడం లో కీలక భూమిక ను పోషించింది సేవాలాల్ సేన అని గుర్తుచేశారు. అదేవిదంగా నవంబర్ 9 న సింహ గర్జన సభను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన జాతీయ నాయకులు ధరావత్ మోతిలాల్ నాయక్ ,రాష్ట్ర నాయకులు మాలోత్ సురేష్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాదావత్ రాంబాబు నాయక్, జిల్లా కార్యదర్శి భానోత్ నరేందర్ నాయక్, జిల్లా ప్రచార కార్యదర్శి బానోత్ రెడ్య నాయక్, మహబూబాద్ మండల అధ్యక్షులు మంగీలాల్ నాయక్, జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జి బోడ సుమన్ నాయక్, విద్యార్థి సేన జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య రాంబాబు నాయక్, సేవాలాల్ సేన పట్టణ ప్రధాన కార్యదర్శి బోడ దిలీప్ నాయక్, సేవాలాల్ రైతు సేన జిల్లా అధ్యక్షులు బానోతు లింగ్య నాయక్, సేవాలాల్ మహిళా సేన జిల్లా ఉపాధ్యక్షురాలు బానోతు పూజ బాయ్, సేవాలాల్ ఆటో యూనియన్ అధ్యక్షులు రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సేవాలాల్ సేన 10వ ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించిన
### సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు
### ఆంగోత్ రాంబాబు నాయక్.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధరావత్ సురేష్ నాయక్ సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయం ప్రక్కన ఏర్పాటు ఏర్పాటుచేసిన ఆవిర్భవ దినోత్సవ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సెంట్రల్ కమిటీ చైర్మన్ ధరావత్ ప్రేమ్చంద్ నాయక్,జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆంగోతు రాంబాబు నాయక్ గార్లు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు ఆంగోతు రాంబాబు నాయక్ సేవాలాల్ సేన జండాను ఆవిష్కరించి మాట్లాడారు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో పెద్ద ఎత్తున సేవాలాల్ సేన సైనికులు ఎడతెరపనీ వర్షాన్ని లెక్కచేయకుండా జెండా ఆవిష్కరణ చేయడం సేవాలాల్ సేన ఐక్యతకు నిదర్శనం అని అన్నారు. అదేవిధంగా ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సమన్వయ కమిటీ చైర్మన్ టీఎస్. టిటిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు మాట్లాడుతూ తెలంగాణలో సేవాలాల్ సేన ప్రత్యామ్నాయకాబోతావుందనిక కాబోతావుందని అన్నారు బంజారా బిడ్డలు ఎటువైపు మొగ్గుచూపితే అటువైపు అధికారం వస్తదని కేసీఆర్ అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తెలుసని అన్నారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ జిల్లా ఈ జిల్లాలో అపారమైన ఖనిజ సంపద గోదావరి పరివాహక ప్రాంతం బొగ్గు నిక్షేపాలు అన్నీ ఉండి ఇండస్ట్రీస్ బలంగా నిర్మించబడి ఈ రాష్ట్రానికి ఆర్థిక వనరులుగా ఉపయోగపడుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏజెన్సీ జిల్లా మీద దృష్టి పెట్టకుండా వెనుకబాటు తనానికి కారణం అవుతుంది తెలంగాణలోనే థర్మల్ రెండ పవర్ స్టేషన్ నాలుగైదు చోట్ల ఇల్లందు కోయగూడెం కొత్తగూడెం మణుగూరు ఏరియాలలో కోల్ బెల్టుబారకల్మజాలపాక భారీ జల కర్మకారము అశ్వాపురం నవభారతం ఉన్నప్పటికీ ఈ భద్రాది జిల్లాకు ఒరిగింది ఏమి లేదని వాపోయారు కోల్ బెల్టు ఏరియా అందులో ఇండస్ట్రీ ఏరియా కావడం వల్ల ఇక్కడ వాతావరణం నీళ్లు ఆహారము కలుషితమై ఇక్కడున్న ప్రజలకు తెలియకుండానే క్యాన్సర్ బారిన పడతావున్నారు ఈ విషయం తెలివక అమాయక గిరిజనలు క్యాన్సర్ వచ్చిందని విషయం తెలవకుండా చూపించే నాటికి నాలుగో స్టేజిలో చచ్చిపోతా ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వము ఈ జిల్లా మీద దృష్టి పెట్టి మెగా మెడికల్ క్యాంప్ పెట్టి క్యాన్సర్ బారిన పడినటువంటి రోగులను గుర్తించి వారికి చికిత్స చేయాలని అదేవిధంగా కోల్ బెల్టు ఏరియాలో సూపర్ స్పెషాలిటీ క్యాన్సర్ హాస్పిటల్ ను ఏర్పాటు చేయాలని కోరారు భద్రాద్రి జిల్లా కళ్ళముందు కనబడుతున్న నీళ్లు ఇక్కడున్నటువంటి రైతులుకి అందకపోవడము దారుణం అన్నారు రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి ఉన్నప్పుడు అండర్ లైన్ ద్వారా రోల్లపాడు చెరువుకి బయ్యారం పెద్ద చెరువుకి ఒక లక్ష్యం ఒక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ని ఉన్నప్పటికీ దాన్ని నిర్లక్ష్యం చేస్తూ గత ప్రభుత్వం కేసీఆర్ గారు రోల్లపాడు చెరువు ప్రాజెక్టు పెద్ద ప్రాజెక్ట్ చేయాలని శంకుస్థాపన చేసినప్పటికీ అది శంకుస్థాపనకి పరిమితమైందని సీతారామ ప్రాజెక్టు నీళ్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అందాల్సినది పోయి పక్క జిల్లా కు చేరడం అనేది పాలకుల నిర్లక్ష్యంగా మేము భావిస్తాం ఉన్నాం ఇప్పటికైనా ఈ భద్రాద్రి జిల్లాని కోనసీమ జిల్లాగా మార్చేలా ప్రతి రైతుకు నీళ్లు అందేలా కిన్నెరసాని రోల్లపాడు బయ్యారం చెరువులని లింక్ చేస్తూ కాలువ నిర్మించాలని డిమాండ్ చేస్తా ఉన్నాము ఏజెన్సీ ప్రాంతంలో 5 త్ షెడ్యూల్ ద్వారా1/70 యాక్ట్, పీసా చట్టం ద్వారా గిరిజనులకు అందాల్సినటువంటి హక్కులను కాపాడే దాంట్లో రాష్ట్రప్రభుత్వం ముందుండాలని కోరారు అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతంలోని రైతులకు 20 ఎకరాలకు రైతు భరోసా వర్తింప చేయాలని రెండు లక్షల రుణమాఫీకి కండిషన్స్ అప్లై చేయకుండా ఉద్యోగులకు కుటుంబంలో ఎంత మంది ఉంటే అంతమందికి రెండు లక్షల రుణమాఫీ చేయాలని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రభుత్వానికి కోరింది కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం సేవాలాల్ సేన ప్రతి అంశాన్ని పరిశీలించి పరిష్కరించాలని కోరారు ధరావత్ ప్రేమ్చంద్ నాయక్ సెంట్రల్ కమిటీ చైర్మన్ వ్యవస్థాపకులు మాట్లాడుతూ బంజారా జాతి రాజ్యాధికారం దిశగా ప్రయాణించేంతవరకు నా కొనవుపిరి వరకు పోరాడతారని బంజారా బిడ్డలని ఏకం చేసే పనులనే ఉంటానని జాతి ఐక్యతే నాకు ప్రాణం అని ఇవాళ సేవాలాల్ సైనికులకు దశ నిర్దేశం చేశారు. సేవలాల్ సేన నాయకులు ధర్మజాగరణ సేన రాష్ట్ర ఇంచార్జ్ వాంకుడోత్ హత్తి రామ్ నాయక్, సేవాలాల్ యువసేన రాష్ట్ర అధ్యక్షులు బాదావత్ శ్రీను నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రవి రాథోడ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీను నాయక్ ధర్మ జాగరణ సేన ఉపాధ్యక్షులు రాంచందర్ నాయక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జరుపుల మంగీలాల్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్, జిల్లా అధికార ప్రతినిధి నాగరాజు నాయక్ ఉపాధ్యక్షులు రమేష్ నాయక్ ,గణేష్ నాయక్ జిల్లా నాయకులు వివిధ మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ సుర్నపు సావిత్రి అంతిమయాత్రలో పాల్గొని
# పాడే మోసిన ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్





మానుకోట జిల్లా (గౌతమ్ న్యూస్): ఆదివారం మహబూబాబాద్ పట్టణ కేంద్రానికి చెందిన మాజీ వైస్ చైర్మన్, సిపిఎం మున్సిపల్ ఫ్లోర్ లీడర్, వార్డు కౌన్సిలర్ సుర్ణపు సోమయ్య సతీమణి కామ్రేడ్ సుర్ణపు సావిత్రి చికిత్స పొందుతూ అపోలో ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. కామ్రేడ్ సుర్ణపు సావిత్రి పార్థివదేహానికి విప్లవ జోహార్లు అర్పించిన మహబూబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, రిజిస్టర్ హరికోట్ల రవి, సిపిఐ, సిపిఎం నాయకులు, మానుకోట జిల్లా ప్రముఖులు కామ్రేడ్ సూర్ణపు సావిత్రి అంతిమయాత్రలో పాల్గొని పాడే మోస్తూ దుఃఖించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కామ్రేడ్ సావిత్రమ్మ మన మధ్యలో లేకపోవడం చాలా బాధాకరమన్నారు, బడుగు బలహీన వర్గాల కోసం తన మాట ఒక తూటగా తన ప్రజాసేవే, జీవితంగా సుర్ణపు సోమయ్య ఆశయాల భాగస్వామిగా వారడిలో అడుగు వేస్తూ ప్రతిక్షణం వారికి చేదోడుగా వాదోడుగా ఉంటూ ప్రజా ఉద్యోగంలో తమకంటూ ఒక మంచి గుర్తింపు పొందినటువంటి దంపతుల మధ్య ఆ యొక్క దేవుడు ఇంత హఠాత్తుగా కామ్రేడ్ సావిత్రమ్మ ని ఆ దేవుడు తీసుకెళ్లి పోవడం చాలా బాధాకరమన్నారు. వారి యొక్క సేవలు ప్రజా జీవితం చివరి స్థాయిగా నిలిచిపోతయని, ఎంతో మంచితనం సంపాదించు కున్నటువంటి సావిత్రమ్మ లాంటివారు ఇకముందు చూడబోమని, సుర్ణపు సోమయ్య కుటుంబంతో ఉన్నటువంటి అనుబంధం గత 15 నుండి 20 సంవత్సరాల నుండి కొనసాగుతుందని ఉమా మురళి నాయక్ మున్సిపల్ చైర్మన్ గా ఉన్నప్పుడు వారికి ఎంతో చేదోడుగా వాదోడుగా ఉంటూ నిత్యం వారికి సహాయకారాలను అందిస్తూ మంచిలో చెడులో ఉమామురళి నాయక్ కి వెన్నంటే ఉంటూ ఎనలేని సేవలు చేసి, ఐదు సంవత్సరాలు మచ్చ లేకుండా నిజాయితీగా కొనసాగిందంటే అది ఒక్క సూర్నపు సోమయ్య కుటుంబం ద్వారానే అని వ్యాఖ్యానించారు. కామ్రేడ్ సూర్ణపు సావిత్రి అంతిమయాత్రలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, సిపిఎం పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్లు అజయ్ సారధి విజయ్ సారధి మహబూబాద్ ప్రస్తుత పలు వార్డుల కౌన్సిలర్లు పోతరాజు రాజు, జిల్లా మైనార్టీ నాయకులు మహమ్మద్ ఖలీల్, వివిధ పార్టీల నాయకులు సిపిఎం పార్టీ ప్రధాన కార్యదర్శులు, జిల్లా కార్యదర్శులు రాష్ట్ర కార్యదర్శిలు, సిపిఎం పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు తదరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## మానుకోట జిల్లాలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు

మానుకోట జిల్లా (గౌతమ్ న్యూస్): మహబూబాబాద్ మండల పరిధిలోని శివారు అనంతారం ఆదర్శ పాఠశాలలో ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను ప్రిన్సిపల్ డి. అమరావతి అధ్యక్షతన జరుపుకోవడం జరిగింది. ప్రిన్సిపాల్ డి.అమరావతి మాట్లాడుతూ తెలంగాణ వైతాళికుడు, ప్రజల పక్షంవహించిన ప్రజాకవి, రచయిత, ఉద్యమకారుడు, పద్మవిభూషణ్, కాళోజీ నారాయణరావు కాళోజీ స్ఫూర్తిని కొనసాగించేందుకు ఆయన జయంతిని నేడు రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ భాషా దినోత్సవం జరుపుకుంటున్నాం. అన్యాయానికి ఎదురొడ్డి నిత్య చైతన్య శీలి. జీవితమే గమనం, ఉద్యమమే శ్వాసగా జీవించిన మహానుభావుడు. అందుకే ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం. ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రముఖ కవి కాళోజీ నారాయణరావు




అన్యాయానికి దిశానిర్దేశం చేసేవాడు. కాళోజీ 1914 సెప్టెంబర్ 9న కర్ణాటక రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలోని రట్టిహళ్లి గ్రామంలో జన్మించారు. అతని తల్లి రమాబాయమ్మ కన్నడిగు మహిళ, తండ్రి కాళోజీ రంగారావు మహారాష్ట్రీయుడు. మాడపాటి, సురవరం, జమలాపురం కేశవరావు, బూర్గుల రామకృష్ణారావు, పి.వి నరసింహారావు తో పాటు అనేక ఉద్యమాల్లో కాళోజీ పాల్గొన్నారు. విద్యార్థిగా ఉన్నప్పుడే నిజాం ప్రభుత్వ నిషేధాన్ని ఉల్లంఘించి వరంగల్ లో గణపతి ఉత్సవాలు నిర్వహించారు. తెలంగాణలో అక్షరజ్యోతిని వ్యాప్తి చేయాలనే ఆకాంక్షతో ఆంధ్ర సారస్వత పరిషత్‌ను స్థాపించిన వారిలో కాళోజీ ప్రముఖులు. అభ్యర్థి ఏపార్టీ వార్టీ వాడని కాదు ఏపాటి వాడో చూడు, ఇప్పటిదాకా ఏం చేశాడో చూడు...! పెట్టుకునే టోపీ కాదు, పెట్టిన టోపీ చూడు, ఎన్నికల్లో మంచి అభ్యర్థిని ఎన్నుకోవడం ఎంత ముఖ్యమో కాళోజీ తెలియచేశారు. తూటాల్లాంటి మాటలతో గుండెల్లో గుచ్చుకునే కాళోజీ కవితల గురించి ఎన్నిసార్లు చెప్పినా తక్కువే, కాళోజీ ఒక కళాశాల, వాడుక భాషలోని మాధుర్యాన్ని చాటిచెప్పి అవినీతిని అక్షరాలతో బద్దలు కొట్టిన మహానుభావుడు మన కాళోజీ. అందుకే కేంద్రం పద్మవిభూషణ్‌తో గౌరవించింది. దీంతో కాళోజీ పుట్టినరోజైన సెప్టెంబరు 9ని తెలంగాణ భాషా దినోత్సవంగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



## దొంతి ప్రభుత్వ పాఠశాలకు 8 ఫ్యాన్లు వితరణ

### లయన్స్ క్లబ్ బాలనగర్ ఇలైట్ కార్యదర్శి అవధూత పాండురంగం




నర్సాపూర్ **(గౌతమ్ న్యూస్):** శివ్వంపేట: లయన్స్ క్లబ్ బాలనగర్ ఇలైట్ కార్యదర్శి అవధూత పాండురంగం 8ఫ్యాన్ లు దొంతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 8ఫ్యాన్లు లయన్స్ క్లబ్320-బి డీజీ రాజేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా హెచ్ఎం రవికి అందించారని వైద్య రత్న, ప్రముఖ వైద్యులు, లయన్స్ క్లబ్ బాలనగర్ ఇలైట్ జోన్ ఛైర్పర్సన్ డాక్టర్ విశ్వనాథ్ సుబ్రహ్మణ్యం, లయన్స్ క్లబ్ అధ్యకుడు దేవరాజ్ తెలిపారు. క్లబ్ సెక్రటరీ పాండురంగం, డాక్టర్ చంద్రశేఖర్, గోపినాథ్, క్లబ్ కోశాధికారి వాసు శంకర్, డాక్టర్ సులేఖ, దీపారాణి, చల్ల శ్రీనివాస్ రెడ్డి, జడ్ సీ శంకర్, సీఏ.కిషోర్, ఆనంద్ బాబు, మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

## తెలంగాణ ప్రదేశ్ రాష్ట్ర పి సి సీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గారికి శుభాకాంక్షలు తెలియజేసిన

### మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, శివంపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొడకంచి సుదర్శన్ గౌడ్, కొడకంచి శ్రీనివాస్ గౌడ్



నర్సాపూర్ **(గౌతమ్ న్యూస్):** తెలంగాణ ప్రదేశ్ రాష్ట్ర పి సి సీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గారిని జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ నియోజకవర్గం ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి మైనాంపల్లి హన్మంత్ రావు గారితో కలిసి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొడకంచి శ్రీనివాస్ గౌడ్ శివంపేట మండలం అధ్యక్షులు కొడకంచి సుదర్శన్ గౌడ్ నర్సాపూర్ నియోజకవర్గం కు ఒకసారి వచ్చి సందర్శించి నియోజకవర్గం అభివృద్ధి కి సహకరించగలరు అని వారితో కోరినట్లు కే.శ్రీనివాస్‌బిగౌడ్ తెలిపారు ఈ కార్యక్రమం లో మాజీ జడ్పీటీసీ లక్ష్మి కాంతం పాక్స్ చర్మన్ వెంకట్రాంరెడ్డి మాజీ ఎంపీటీసీ జంగం వెంకటేష్ గోమారం మాధవ్ రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ బి శ్రీనివాస్ గౌడ్ ఎం రమేష్ చంది నరగౌడ్ యూత్ కాంగ్రెస్ శ్రీను ఎస్టీ సెల్ తిరుపతి రాథోడ్ యువనాయకులు కే గణేష్ గౌడ్ సూర్యం చేవాహన్ కాముని నాగేష్ మెదకు హరిబాబు గౌడ్ ముదగాళ్ల నర్సింలు మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఇంటింటి జ్వరము సర్వే, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించిన

### సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డే బోయిన శ్రీనివాస్



మానుకోట జిల్లా **(గౌతమ్ న్యూస్):** మానుకోట జిల్లా మున్సిపాలిటీ కంకర బోర్డ్ సబ్ సెంటర్ ఇందిరా నగర్ కాలనీ మరియు సబ్ సెంటర్ కృష్ణ కాలనీ ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ ఓల్డ్ రైల్వే గేట్ నందు నిర్వహించిన ఇంటింటి జ్వరస్ సర్వేను మరియు పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి ఈ సందర్భంగా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఇంటిని సందర్శించి జ్వరము ఉన్నచో టాబ్లెట్స్ ఇవ్వాలని అలాగే చెత్త చెదారాలను ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తెలపడం జరిగింది అలాగే ఫ్లై ఓవర్ బ్రిడ్జి పక్కన ఉన్న గుడిసెలను సందర్శించి అందరిని పరీక్షించి మందులను ఇవ్వడం, అలాగే పక్కన ఉన్న మురికి గుంతలలో టెమోఫస్ మరియు బ్లీచింగ్ పౌడర్ అలాగే ఆయిల్ బాల్స్ వేయాలని, సూచించడం జరిగింది అక్కడ ప్రజలందరికీ ఆరోగ్య సూత్రాలను బోధించి, గుడిసె వాసులకు వరదల వల్ల జాగ్రత్తగా ఉండాలని ముందు జాగ్రత్తలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి నితిన్, ఏ ఏ ఎన్ ఎం లు లలిత, అశ్విని, ఆశలు రమ, మాధవి, మహేశ్వరి, మమత మరియు ప్రజలు పాల్గొన్నారు.

## కామ్రేడ్ మావో 48వ వర్ధతి



బయ్యారం**(గౌతమ్ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా బయ్యారం:..మార్క్సిస్టు మహోపాధ్యాయులు కామ్రేడ్ మావో 48వ వర్ధంతి సందర్భంగా బయ్యారం మండల కేంద్రం పార్టీ కార్యాలయంలో నివాళులర్పించడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ మైదాన మండల కార్యదర్శి ఎం. నాగేశ్వరరావు మాట్లాడుతూ చైనాలో ఫ్యూడల్ స్వాముల ఆధీనంలో చిన్న చిన్న భాగాలుగా ఉన్న ప్రాంతాలను కామ్రేడ్ మావో నాయకత్వంలో ఎర్రసైన్యం తో లాంగ్ మార్చ్ ప్రాంతాలను ఐక్యం చేసి 1949 లో చైనాలో విప్లవాన్ని విజయవంతం చేశాడు.1949 చైనా కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడి పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా ( పి ఆర్ సి ) స్థాపనకు విశాలమైన సుదీర్ఘ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించాడు. ఆయన చనిపోయేంతవరకు ఆధునిక ప్రపంచ చరిత్రలో సైనిక ,పారిశ్రామిక ,వ్యవసాయం, సంస్కృతికంగా అనేక మార్పులతో నవ చైనా ను ముందుకు తీసుకుపోయాడని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు తుడుం వీరభద్రం, నేతకాని రాకేష్ , గుండెబోయిన లింగమల్లు , మింగు భగవాన్, పొన్నం రమేష్ ,శేషు ,హనుమా తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ ఎన్నికలను విజయవంతం చేయాలి



నల్లబెల్లి **(గౌతమ్ న్యూస్):** యూత్ కాంగ్రెస్ ఎన్నికలలో భాగంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు నేడు నల్లబెల్లి మండలంలోని రుద్రగూడెం గ్రామంలో యూత్ సభ్యులందరికీ విత్ ఐ వై సి యాప్ ద్వారా మెంబర్షిప్ మరియు ఓటింగ్ విధానాన్ని వివరించి ప్రచారం నిర్వహించిన మండల యూత్ కాంగ్రెస్ అభ్యర్థి పురుషోత్తం సురేష్ మరియు ఎన్ ఎస్ యు ఐ నియోజకవర్గ అధ్యక్షులు నేటి భరత్ ఇట్టి కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు అజ్మీర తిరుపతి క్లస్టర్ ఇంచార్జ్ మామిండ్ల రాజిరెడ్డి ,మాజీ ఉపసర్పంచ్ బై కానీ శివకోటి ,నాయకులు గద్దల సురేష్ వక్కల బాలరాజు ,వక్కల శివ ,రమేష్ ,అజ్మీర రాజు కుమార్, చరణ్ రాజు ,రమేష్ ,సందీప్ ,సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తక్కెళ్ళపల్లి రవీందర్ రావు జన్మదిన వేడుకలు



మానుకోట జిల్లా **(గౌతమ్ న్యూస్):** మానుకోట జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్రావు జయంతి వేడుకలు బి ఆర్ ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ వన్యప్రాణి సంరక్షణ శాఖ డైరెక్టర్ బానోత్ రవికుమార్, మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ జేరిపోతుల వెంకన్న, మంగళంపల్లి కన్నా, మడత వెంకన్న, పుచ్చకాయల రామకృష్ణ, వెంకటాద్రి, వేణుమాధవ్, మా అసోసియేషన్ అధ్యక్షులు బొడ్డుపల్లి ఉపేంద్రం. రవీందర్ రావు పుట్టినరోజు సందర్భంగా టిఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి, పేదలకు దుప్పట్లు, పండ్లు నిత్యవసర వస్తువులు సరఫరా చేశారు. ఇదేవిధంగా గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ నందు రోగులకు పండ్ల పంపిణీ చేసి, నిరుపేదలకు నిత్యవసర వస్తువులు సరఫరా చేసి ఎమ్మెల్సీ రవీందర్రావు చల్లగా నాలుగు కాలాలపాటు జీవించాలని, మంచి పదవిలో ఆశించాలని



నిరుపేదలు రవీందర్ రావణుని దీవించారు. వన్యప్రాణి సంరక్షణ శాఖ మాజీ డైరెక్టర్ బానోతు రవికుమార్ మాట్లాడుతూ మానుకోట జిల్లా కేంద్రంలో రవీందర్ రావు సార్ జన్మదిన పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు, పేదలకు నిత్యవసర వస్తువులు, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశాం. ఎమ్మెల్సీ రవీందర్ రావు సార్ నాలుగు కాలాలపాటు మంచి మంచి పదవిలో ఉండాలని దేవునికి ప్రార్థన చేస్తున్నాం. మానుకోట జిల్లా కేంద్రంలో గత వారం రోజుల కింద వచ్చిన వరదలకు చాలామంది నిరాశ్రయులు అయ్యారు. పేదలకు వరదల కారణంగా నిరాశ్రయులు అయినా కుటుంబాలకు నిత్యవసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేసినం. అలాగే ఎలాంటి సమస్య ఉన్న మాకు చెబితే రవీందర్ రావు సార్ ద్వారా వారికి ఎలాగో అలా సహాయం చేస్తం అని అన్నారు. ఈ సందర్భంగా మా అసోసియేషన్ అధ్యక్షులు బొడ్డుపల్లి ఉపేంద్రం మాట్లాడుతూ మహబూబాబాద్ ప్రాంత ముద్దుబిడ్డ మలిదశ తెలంగాణ ఉద్యమకారుడిగా ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా తన వాక్చాతుర్యంతో ప్రజలలో మన్ననలు పొందిన నాయకుడు మహబూబాబాద్ ప్రాంతంలో కార్పొరేట్ స్థాయి విద్యను అందించుటకు విశేషంగా కృషి చేసి తన విద్యాసంస్థల ద్వారా ఎంతోమందికి విద్యను అందించిన వాడు మహనీయుల జయంతి వర్ధంతి కార్యక్రమాలలో అందుబాటులో ఉన్న ప్రతిసారి పాల్గొనే వాడు మా అసోసియేషన్ తరపున మేము చేసే కార్యక్రమాలకు ఎప్పుడూ పిలిచిన హాజరయ్యే మా అందరివాడు తక్కెళ్ళపల్లి రవీందర్ రావు కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు ఇలాంటి వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నము. మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జర్రిపోతల వెంకన్న మాట్లాడుతూ రవీంద్ర రావు సార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించినందుకు బీఆర్ఎస్ పార్టీ నాయకులకు శ్రేణులకు ప్రత్యేక కృతజ్ఞతలు. మహబూబాబాద్ వరద బాధితులకు జిల్లా కేంద్రంలో శాసనసభ్యులు ఇలాంటి హామీలు ఇవ్వకుండా, ఎలాంటి నిత్యవసర సరుకులు పంపిణీ చేయకుండా చూస్తూ ఉన్నారు. మానుకోట వరద బాధితులకు మా మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, స్వచ్ఛంద సంస్థలు సహాయం చేస్తున్నారు కానీ, స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే నాయకులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్న. వరద బాధితులకు మా బి ఆర్ ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని హామీ ఇస్తున్నాం. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు జన్మదిన సందర్భంగా మహబూబాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జన్మదిన వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేసి ఎమ్మెల్సీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, వన్నెపాణి సంరక్షణ శాఖ మాజీ డైరెక్టర్ బానోత్ రవి కుమార్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు యాస వెంకట్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ జెర్రిపోతుల వెంకన్న, బి ఆర్ ఎస్ నాయకులు మంగళంపెల్లి కన్నా, ముత్యం వెంకన్న, నాయిని రంజిత్, బి ఆర్ ఎస్ జిల్లా నాయకులు నూనవత్ అశోక్, బీఆర్ఎస్ టౌన్ నాయకులు మార్నేని రఘు, దౌలాగర్ శంకర్, ఖలీల్, మార్నేని కిరణ్, మడత వెంకన్న, మాజీ సర్పంచ్ రాజు నాయక్, పుచ్చకాయల రామకృష్ణ, దరావత్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## సిటిజన్ గ్యారేజ్ వాలంటరీ ఆర్గనైజేషన్ వరద బాధితులకు ఇతోధికంగా సహాయం

### బాధితుల అండగా నారీ శక్తి మణులు



బయ్యారం**(గౌతమ్ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా ,బయ్యారం ,గత వారం రోజులుగా అకాల తుఫాను ప్రభావంతో చెరువు ,కుంటలు తెగి వాగులు ,వంకలు ప్రమాద స్థాయిని మించి ప్రవహించి లోతట్టు ప్రాంతాలను జలమయం చేసి ,ఎన్నో కుటుంబాలు ,ఇండ్లను కోల్పోయారు మరికొందరు నిరుపరాదులుగా కట్టు బట్టలే మిగిలి ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు , ప్రాంతం ఏదైనా వరద బాధితులకు మీమున్నామంటూ మహబూబాబాద్ జిల్లా లో నారీ శక్తి మణులు ,డాక్టర్లు, ఐటి, హోం మేకర్స్ ,ఉపాధ్యాయులు సీనియర్ సిటిజన్ ధాతల సహాయం తో అనేకమందికి ఈ మధ్య కేరళలో వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అదే విదంగా మన రాష్ట్రంలో ఖమ్మం లో పలు ముంపు





కాలనీలకు ,మహబూబాబాద్ జిల్లా రావిరాల ,సీతారాంనగర్ కాలనీ , సూర్యపేట, హైదరాబాద్ లోని వరద బాదితులకు మహిళలు ఇతోధికంగా సహాయం అందిస్థూ నారీ శక్తిని చాటుతున్నారు. ఈ



కార్యక్రమంలో సిటిజన్ గ్యారేజ్ వాలంటరీ ఆర్గనైజేషన్ లో ప్రశాంతి , స్వాతి ,జ్యోతి ,సతీష్ ముందుండి తమ సేవలను కొనసాగిస్థున్నారు ,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల కష్టాలలో పాలు పంచుకోవడం మాకు ఎంతో ఆత్మ తృప్తిని ఇస్తుందని , మనుకున్న సంపదలో కొంత మేర సమాజ సేవకు ఉపయోగించాలని అప్పుడే మానవ జన్మకు సార్ధకత చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శృతి సుభానీ , సుప్రియ ,కార్తీక్ ,దీప్తీ తదితరులు పాల్గొన్నారు.

## అజ్మీర రమేష్ కు ఆర్థిక సహాయం అందించిన స్నేహితులు



మానుకోట జిల్లా **(గౌతమ్ న్యూస్):** మానుకోట జిల్లా మున్సిపాలిటీ ఈదులపూసపల్లి, సిత్ల తండ నివాసి అజ్మీర రమేష్ జివనోపాధి నిమిత్తం ప్రైవేట్ కంపెనీలలో పనిచేస్తూ తన కుటుంబాన్ని పోషించుకునే వాడు, అజ్మీర రమేష్ గత కొంత కాలం నుండి షుగర్ సమస్యతో వైద్యం తీసుకుంటూ కాలం నెట్టుకొస్తూ, ఇటీవల కాలుకు గాయం కావడంతో కుడి కాలును కోల్పోవడంతో, మహబూబాబాద్ పెస్టిసైడ్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మిత్ర బృందం హరికృష్ణ, అశోక్, సరేష్, హేమ, రాజకుమార్, నవీన్ సితల తండా లోని తమ మిత్రుడైన అజ్మీర రమేష్ గృహానికి వెళ్లి మనో ధైర్యాన్ని ఇస్తు, మిత్రుడికి ఆర్థికంగా ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు స్నేహితులందరూ కలిసి 30,000 రూపాయలు, రమేష్ అసోసియేషన్ వద్ద 4000 చిట్టి కట్టగా వచ్చిన 5000 రూపాయలు, మొత్తంగా 35,000 రూపాయలు అజ్మీర రమేష్ కు తన నివాసంలో అందించడం తో అజ్మీర రమేష్ మిత్ర బృందానికి కృతజ్ఞతలు తెలియ పరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో తండా ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రవేత్త డాక్టర్ అశ్విని నునావత్ గౌరవార్థం రావిరాల గ్రామంలో నిత్యవసర వస్తువులు పంపిణీ

మానుకోట జిల్లా **(గౌతమ్ న్యూస్):** మహబూబాబాద్ జిల్లాలో గత కొన్ని రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వరదల్లో మరణించిన శాస్త్రవేత్త డాక్టర్ అశ్విని నునావత్ గౌరవార్థం మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రావిరాల



గ్రామంలో డిఎస్ఆర్ గ్రూపు వారి ఆద్వర్యంలో (సి ఎమ్ డి) డాక్టర్ సుధాకర్ ఆదేశాల మేరకు నెల్లికుదురు మండల హర్టికల్చర్ అధికారి జినుగు మరియన్న చేతుల మీదుగా (10) రకాల నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో బాలరాజ్, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రవీణ్ తో పాటు డిఎస్ఆర్ కంపెనీ ప్రతినిధులు ఆర్ఎమ్ రవిందర్ రావు, ఎస్ఈ. కృష్ణంరాజు, సేల్స్ ఆఫీసర్ టి.నవీన్, డీలర్లు అశోక్, సంపత్, యాకూబ్, వేంకటేష్, విష్ణువర్ధన్, రమేష్, గ్రామ పంచాయతీ పెద్దలు పాల్గొన్నారు.

## ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం



నర్సాపూర్ **(గౌతమ్ న్యూస్):** మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గోమారం గ్రామంలో గత వారం రోజులు గా బిక్షాటన చేస్తూ కడుపు నింపుకుంటున్న గుర్తు తెలియని వ్యక్తి ని ఈ నెల నాలుగో తేదీన రాత్రి బస్టాండులో పడుకొని ఉండగా తాగిన మత్తులో కొట్టి విపరీతంగా కొట్టి అక్కడినుండి వెళ్ళిపోయారు వీరు గోమారం గ్రామానికి చెందిన మణికంఠ గౌడ్. తిరుపతి రెడ్డిల పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు.గత నాలుగు రోజుల క్రితం అనుమానస్పదంగా కేసు నమోదు చేసిన పోలీసులు. సోమవారం నాడు సిసి ఫుటేజ్ ఆధారంగా గ్రామస్తుల సమాచారం మేరకు ఇద్దరి నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

## వాసవి క్లబ్ ఆఫ్ మహబూబాబాద్ ఆధ్వర్యంలో గురువులకు సన్మానోత్సవం



మానుకోట జిల్లా **(గౌతమ్ న్యూస్):** సమాజంలో ఉన్న అవినీతిని వెలికి తీయాలంటే కలం తోనే సాధ్యమని జర్నలిస్టులతో సమాజానికి మేలు అని విద్యార్థుల్లో ఉన్న అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానం అనే వెలుగును అందించే వాడే ఉపాధ్యాయుడని తరగతి గదిలో అనునిత్యం విద్యార్థుల ప్రతిభను వెలిక తీసి సమాజానికి ఉపయోగపడేలా విద్యార్థి తయారు చేసే వాడే ఉపాధ్యాయుడని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మహబూబాబాద్ 101ఏ వైస్-గవర్నర్ వేంశెట్టి కిషోర్ కుమార్ అన్నారు. మానుకోట జిల్లా కేంద్రంలోని స్థానిక వాసవి దేవాలయ ప్రాంగణంలో వాసవి క్లబ్ మహబూబాబాద్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవము మరియు జర్నలిస్టుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వాసవి క్లబ్ ల ఆధ్వర్యంలో జర్నలిస్టులను మరియు ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రపంచంలో ఏ మూలన ఏమి జరిగినా పత్రిక ద్వారా ప్రజలకు చేరవేసేది జర్నలిస్టులు అని పలువురు కొనియాడారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా పనిచేస్తూ ఎలాంటి జీత భత్యాలు తీసుకోకుండా సమాజానికి సేవలు అందిస్తున్న జర్నలిస్టులను సన్మానించుకోవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమములో వాసవి క్లబ్ అధ్యక్షులు సోమ రజని కుమార్, ప్రధాన కార్యదర్శి సోమ రాధాకృష్ణ, కోశాధికారి పుల్లకాండం ప్రభాకర్ రావు మరియు వాసవి వనిత క్లబ్ బాధ్యులు తదితర వాసవియాన్లు మరియు ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొని జర్నలిస్టులను ఉపాధ్యాయులను సన్మానించారు.

## మతోన్మాద దోపిడి వ్యతిరేక ఉద్యమాలకు రైతాంగ సాయుధ పోరాటం దిక్సూచి

### ఈనెల 10 నుంచి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు

### ఎంసిపిఐ(యు) జిల్లా కమిటీ సమావేశంలో జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్



నర్సంపేట**(గౌతమ్ న్యూస్):** మతోన్మాద అవినీతి అవకాశవాద దోపిడి విధానాలకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమాలకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం దిక్సూచి లాంటిదని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తిని నింపేందుకు సెప్టెంబర్ 10 నుంచి 17 వరకు గ్రామ గ్రామాన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) వరంగల్ జిల్లా కమిటీ సమావేశం నర్సంపేట లోని ఓంకార్ భవన్ లో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్ కొత్తకొండ రాజమౌళి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ ఆనాడు తెలంగాణ ప్రాంతాన్ని తమ కబంధహస్తాల్లో బంధించుకొని ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్న నైజాం రజాకార్లకు పటేల్ పట్వారి వ్యవస్థకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కావాలని కుల మతాలకతీతంగా యావత్తు ప్రజానికం కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో పోరాడి నైజాంను తరిమికొట్టి భారత దేశంలో అంతర్భాగంగా కలిపి చరిత్రలో నిలిపితే ప్రస్తుత మతోన్మాద బిజెపి పాలకులు చారిత్రాత్మక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఉద్యమానికి మతం రంగు పులుముతూ చరిత్రను వక్రీకరిస్తూ ప్రజల్లో విషం చిమ్ముతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా సెప్టెంబర్ 10 నుంచి 17 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం పాలకుల ప్రజా వ్యతిరేక మతోన్మాద అవినీతి అవకాశవాద రాజకీయాల పట్ల ప్రజలను చైతన్య పరుస్తూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను తెలియజేస్తూ భవిష్యత్తు ఉద్యమాలకు స్ఫూర్తిని నింపుతూ గ్రామాల్లో పట్టణాల్లో ప్రదర్శనలు కార్యక్రమాలు చేయాలని సెప్టెంబర్ 10న హైదరాబాద్ ఓంకార్ భవన్ హాల్ లో జరిగే ప్రారంభ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రజలు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలపై ఎప్పటికప్పుడు కదిలి స్థానిక అధికారుల దృష్టికి తీసుకురావాలని పరిష్కారం కాకపోతే ఆందోళనలు చేపట్టాలని కోరారు. పార్టీ నిర్మాణాన్ని చక్కబెట్టుకునేందుకు శాఖలను కమిటీలను రెగ్యులర్ గా జరపాలని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కుసుంబ బాబురావు వంగల రాగసుధ నాగెల్లి కొంరయ్య కన్నం వెంకన్న కనకం సంధ్య జిల్లా కమిటీ సభ్యులు సుంచు జగదీశ్వర్ మహమ్మద్ రాజా సాహెబ్ ఎండి ఇస్మాయిల్ సింగతి మల్లికార్జున్ కేశెట్టి సదానందం జన్ను రమేష్ ఐతమ్ నాగేష్ గాజుల వెంకటయ్య దామ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## 2026 ఆసియా క్రీడల్లో ప్రదర్శన క్రీడగా 'యోగాసన'




న్యూఢిల్లీ: భారతదేశ ప్రాచీన వ్యాయామ పద్ధతి 'యోగాసన'కు ఆసియా క్రీడల్లో చోటు దక్కింది. 2026లో జపాన్‌లోని ఐచీ-నగోయాలో జరగనున్న ఆసియా క్రీడల్లో యోగాసనను ప్రదర్శన ఈవెంట్‌గా చేర్చుతున్నట్లు ఆసియా ఒలింపిక్ కౌన్సిల్ (ఓసీఏ) ప్రకటించింది. ఆదివారం జరిగిన 44వ ఓసీఏ సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఓసీఏ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన రణ్‌దీర్ సింగ్ మాట్లాడుతూ... '2026 ఆసియా క్రీడల్లో యోగా భాగం కానుంది. దీనికి అందరి ఆమోదం లభించింది. అన్ని సభ్య దేశాలను ఒప్పించేందుకు పది రోజుల సమయం పట్టింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యోగాను ప్రతి ఒక్కరి జీవితంలో భాగం చేసేందుకు విశేష కృషి చేస్తున్నారు. ఆ దిశగా ఇది మరో ముందడుగు వంటిది. 2030 ఆసియా క్రీడల వరకు యోగాను పతక క్రీడల్లో భాగం చేసేలా చూస్తాం' అని అన్నారు.

## వైఫల్యాలు బయటపడకుండా బాబు డైవర్షన్ పాలిటిక్స్



నెల్లూరు,: వరద నివారణ చర్యలతో పాటు వరద సహాయక కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు వైఎస్ జగన్‌ను విమర్శిస్తున్నారని మండిపడ్డారు.ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. " 1964 లోనే బుడమేరకు భారీ వరద వచ్చింది.. అప్పుడు పదిమంది మరణించారు. రియల్ టైం గవర్నెన్స్ గురించి చెప్పే చంద్రబాబు.. వరద తీవ్రతను ఎందువల్ల గుర్తించలేదు. నీటిని విడుదల చేయాలని అధికారులు చెబుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. బాధితులను ఎందువల్ల పునరావాస కేంద్రాలకు తరలించలేకపోయారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తాను నివాసం ఉంటున్న ఇంటి నుంచి పునరావస కేంద్రమైన కలెక్టరేట్‌కి వెళ్లారు. వరదలు తగ్గిన తర్వాతే ఇంటికి వెళ్తానని చెబుతున్నారు. చంద్రబాబు ఉన్న ఇల్లు... నీటిలో మునిగింది అందువల్లే అక్కడికి పోవడం లేదు. హైదరాబాద్‌లో హైడ్రా కంటే ముందే రాష్ట్రంలో జగన్ అక్రమ కట్టడాలను కూల్చడం ప్రారంభించారు. హైదరాబాద్‌లో హైడ్రా చర్యలను పచ్చ మీడియా ప్రశంసిస్తోంది.. కానీ గతంలో అక్రమ కట్టడాలను పడగొడితే మాత్రం అదే మీడియా గగ్గోలు పెట్టింది. వైఎస్ జగన్ మోకాలు లోతు వరద నీటిలో దిగి పరామర్శలు ప్రారంభించిన తర్వాతే చంద్రబాబు నీళ్లలోకి దిగారు. వైఎస్సార్‌సీపీ హయాంలో తీసుకు వచ్చిన రేషన్ వాహనాలనే ఇప్పుడు వాడుతున్నారు. వరదల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు.. రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి. ఏ సీజన్‌లో నష్టం జరిగితే ఆ సీజన్‌లోనే జగన్ పరిహారం చెల్లించారు. మత్స్యకారుల బోట్లు కొట్టుకుపోయాయి.. ఆక్వా రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వ వైఫల్యాలు బయటపడకుండా ఉండేందుకు చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రకాశం బ్యారేజీకి వైఎస్సార్‌సీపీకి చెందిన వారి బోట్లు వచ్చాయని చెబుతున్నారు. చంద్రబాబును జాకీలు పెట్టి పచ్చ మీడియా ఎత్తుతోంది. రైల్ ట్రాక్ పక్కన చంద్రబాబు నిలబడితే... బాబుకు తప్పిన ప్రమాదం అంటూ ప్రచారం చేశారు. వరదల్లో ప్రాణాలు పోయిన అన్ని మరణాలను చంద్రబాబు హత్యలుగానే పరిగణించాలి' అని అన్నారు.

## ఐఐటీల్లో ఉన్నత చదువులు.. జీతాలు మాత్రం నామమాత్రమే..!

దేశవ్యాప్తంగా ఉన్నత చదువులు చదువుతున్న ఐఐటీ విద్యార్థులకు మొన్నటివరకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ నెలకొన్న విషయం తెలిసిందే. సాధారణ యూనివర్సిటీల్లో చదివే విద్యార్థులకంటే ఐఐటీల్లో చదివే వారికి టెక్నికల్ స్కిల్స్,క్రియేటివ్, మేనేజ్మెంట్, లీడర్ షిప్ స్కిల్స్ అధికంగా ఉంటాయని పేరుంది. కమ్యూనికేషన్ స్కిల్స్ పరంగాను వీరికి క్యాంపస్ రిక్రూట్‌మెంట్ టైంలో కంపెనీలు పెద్దపీట వేస్తుంటాయి. కానీ, గత ఏడాదిన్నర కాలంగా ఐఐటీల్లో చదివిన విద్యార్థులకు సైతం పెద్దగా వేతన ప్యాకేజీలు రావడం లేదు. ఆ మధ్యకాలంలో ఐఐటీ విద్యార్థులకు ప్లేస్ మెంట్స్ కూడా రాకపోవడం చర్చ నీయాంశంగా మారింది. ఇక పోతే కంపెనీలు ఐఐటీ స్టూడెంట్స్‌కు ఇస్తున్న వార్షిక వేతనం రూ.6లక్షల నుంచి రూ.7లక్షలలోపే ఉంటోంది. టాప్ సంస్థల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక పరిస్థితులు విద్యార్థుల ప్యాకేజీలపై ప్రభావం చూపిస్తున్నాయని సమాచారం. గతేడాది ఐఐటీ బాంబేలో 22 మందికి రూ.కోటి ప్యాకేజీ లభించగా.. అతితక్కువ ప్యాకేజీ రూ.4 నుంచి 6 లక్షలుగా నమోదైంది. ఖరగ్ పూర్, రూర్కీల్లో రూ.8లక్షలుగా ఉంది.

## చంద్రబాబు ఫెయిల్ -ఇదే సాక్ష్యం
## 60 ఏళ్ల క్రితం వరదల క్లిప్ తో వైసీపీ విమర్శలు..!

**అమరావతి,:** ఏపీలోని విజయవాడను ముంచెత్తిన బుడమేరు వరదలపై ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. బుడమేరు వరదల్ని అడ్డుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందంటూ విపక్ష వైసీపీ విమర్శిస్తుండగా.. అధికార పక్షం మాత్రం వరద సహాయక చర్యల్లో దూకుడుతో దాన్ని కవర్ చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఇదే క్రమంలో గతంలో బుడమేరు వరదలు వచ్చినప్పుడు పరిస్థితులతో ఇప్పటి నష్టాల్ని పోలుస్తూ వైసీపీ ఎక్స్ లో ఓ పోస్టు పెట్టింది. వైసీపీ పెట్టిన పోస్టులో గతంలో 1965లో వచ్చిన బుడమేరు వరదలకు సంబంధించిన న్యూస్ పేపర్ క్లిప్ ఒకటి ఉంది. అప్పట్లో బుడమేరు వరదలు వచ్చినప్పుడు కూడా 40 వేల క్యూసెక్కుల నీరే వచ్చిందని, కేవలం 10 మందే గల్లంతయ్యారని, కానీ ఇప్పుడు అంతే వరద వచ్చినా నష్టం ఎక్కువగా ఉండటాన్ని ప్రస్తావిస్తూ అధికార కూటమిపై విమర్శలు గుప్పిస్తోంది. అప్పటికీ ఇప్పటికీ టెక్నాలజీ పెరిగినా నష్టాన్ని మాత్రం నివారించలేకపోయారంటూ కూటమిని టార్గెట్ చేస్తోంది. 60 ఏళ్ల క్రితం బుడమేరుకి 40 వేల క్యూసెక్కుల వరద వచ్చినా, జరిగిన ప్రాణనష్టం 10 మందే అని అప్పట్లో ఇంత టెక్నాలజీ కూడా లేదని వైసీపీ ట్వీట్ లో గుర్తుచేసింది. కానీ.. ఇప్పుడు ఇంత టెక్నాలజీ అందుబాటులో ఉండి.. టెక్ సీఎంగా పోజులు కొట్టే చంద్రబాబు అధికారంలో ఉండగా బుడమేరు వరదతో చనిపోయిన వారు 50 మందిపైనే అని ఆరోపించింది. చంద్రబాబు అట్టర్‌ఫ్లాప్ సీఎం అనడానికి ఇంతకంటే సాక్ష్యం కావాలా? అంటూ వైసీపీ విమర్శలు గుప్పించింది. ఇప్పటికే వరద సహాయక చర్యల విషయంలో చంద్రబాబు తీరుపై విమర్శలు చేస్తున్న వైసీపీ ఇప్పుడు ఈ క్లిప్ ను వైరల్ చేస్తోంది.

## కుమారస్వామి గౌడ్ కు మోకుదెబ్బ నాయకుల నివాళులు



నర్సంపేట(**గౌతమ్ న్యూస్**): నర్సంపేట మండలం ఇటుకాలపల్లి గ్రామం లో ఇటీవల అనారోగ్యంతో బోడిగే కుమారస్వామి గౌడ్ స్వర్గస్తులయ్యారు. విషయం తెలిసిన గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ ఆయన స్వగృహంలో కీశే. కుమారస్వామి గౌడ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుమారస్వామి గౌడ్ కుమారులు కిరణ్ గౌడ్, అశోక్ గౌడ్, ప్రవీణ్ గౌడ్ లను పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మోకుదెబ్బ జిల్లా అధ్యక్షులు గోపగాని వెంకట్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి మద్దెల సాంబయ్య గౌడ్, నర్సంపేట పట్టణ అధ్యక్షులు గండి గిరి గౌడ్, ఇటుకాలపల్లి గౌడ సంఘం అధ్యక్షులు బుర్ర ఆనందం గౌడ్, కక్కెర్ల కుమార్ గౌడ్, కట్ల సుధాకర్ గౌడ్, మేరుగు శ్రీనివాస్ గౌడ్, దుపటి మల్లయ్య గౌడ్, కట్ల కనుకయ్య గౌడ్, బూడిద రవీందర్ గౌడ్, బత్తిని అశోక్ గౌడ్, తాళ్లపెల్లి కృష్ణ గౌడ్, మాజీ ఎంపీపీ బూర్గు రవీందర్ గౌడ్, నాలం విజయ్ కుమార్ గౌడ్, బోడిగే వినయ్ కుమార్ గౌడ్,వేముల రవి గౌడ్, మర్ద దేవేందర్ గౌడ్,దుపటి కుమార్ గౌడ్, బత్తిని సాంబయ్య గౌడ్, బోడిగే క్రాంతి కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆస్తులను అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్న జర్నలిస్టులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి






సూర్యాపేట(**గౌతమ్ న్యూస్**): 59 జీవో ముసుగులో తప్పుడు పత్రాలతో ప్రభుత్వ ఆస్తులను అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్న జర్నలిస్టులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ నల్గొండ జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి,ఎస్పీ శరత్ చంద్రపవార్ లకు జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటి సభ్యులు పిర్యాదు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులను మేనేజ్ చేసి జిల్లా కేంద్రంలో ఇరిగేషన్ శాఖకు సంబంధించిన రూ 10 కోట్ల విలువ గల ప్రభుత్వ క్వార్టర్స్ ను గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న ఎనిమిది మంది జర్నలిస్టులు... 59 జీవోను అడ్డం పెట్టుకుని నకిలీ మున్సిపల్ బిల్లులు, తప్పుడు ఇంటి నెంబర్లు సృష్టించి ప్రభుత్వ యంత్రాంగాన్నే బురిడీ కొట్టించిన జాదుగాళ్ళు... ఇరిగేషన్ శాఖకు సంబందం లేకుండానే రికార్డులు తారు మారు చేసిన మాయగాళ్ళు జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ఆందోళనతో అక్రమ క్రమబద్దీకరణ చేసుకున్న రిజిస్ట్రేషన్ లు రద్దు చేసినట్టు ప్రకటన చేసిన జిల్లా అధికారులు... ఇతర జిల్లాలో ఇదే ఇష్యూ లో నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైల్ కు పంపిన అధికారులు నల్గొండ జిల్లాలో ఇప్పటి వరకు పోలీసులకు ఫిర్యాదు చేయని సంబంధిత శాఖ పవిత్ర వృత్తిలో ఉండి, జర్నలిజానికే మచ్చ తెచ్చిన అక్రమార్కులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్,ఎస్పీ లకు పిర్యాదు చేసిన జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ సభ్యులు

### అక్రమాలకు పాల్పడ్డ ఆ ఎనిమిది మంది జర్నలిస్టుల లిస్ట్ ??

1..జిల్లెపల్లి దత్తురెడ్డి, ఈనాడు పత్రిక బ్యూరో చీఫ్, నల్గొండ జిల్లా (తన భినామీ బడా బిల్డర్ మామిళ్ల రామంజన్ రెడ్డి పేరుతో ల్యాండ్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు) 2. మర్రి మహేందర్ రెడ్డి, నమస్తే తెలంగాణ పత్రిక బ్యూరో చీఫ్, నల్గొండ జిల్లా 3. బూర రాము, Tnews స్టాఫ్ రిపోర్టర్,నల్గొండ జిల్లా 4. ముప్ప రేవన్ రెడ్డి, TV9 స్టాఫ్ రిపోర్టర్, నల్గొండ జిల్లా 5. నారబోయిన క్రాంతి, క్రాంతి పోస్ట్ అనే యూట్యూబ్ ఛానెల్ అధినేత 6. బోయపల్లి రమేష్, R TV స్టాఫ్ రిపోర్టర్, నల్గొండ జిల్లా 7. మారబోయిన మధుసూధన్, నాటి ఆంధ్రజ్యోతి దినపత్రిక బ్యూరో చీఫ్ (ప్రస్తుతం తెలంగాణ డిప్యూటి సీఎంబట్టివిక్రమార్కపిఆర్వో)
8. పసుపులేటి కిరణ్ కుమార్, వెలుగు దినపత్రిక బ్యూరో చీఫ్, నల్గొండ జిల్లా

# విదేశాలకు క్లియరెన్స్ సర్టిఫికెట్ కావాలా..

విదేశాల వెళ్లాలనుకునేవారికి ఇన్‌కంట్యాక్స్ డిపార్టుమెంటు వారి నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్ కావాలా అనే ప్రశ్న ఈ మధ్య చాలా ఎక్కువగా వినిపిస్తోంది. దీనికి సుందరకాండలో హనుమంతుడి జవాబులాగా "అక్కర్లేదు" అని చెప్పాల్సి ఉంటుంది. ఇప్పుడు వివరాల్లోకి వెళదాం.. ఈ మధ్యే ఆర్థిక శాఖ తెచ్చిన బడ్జెట్ ప్రతిపాదనలో విదేశీయానం చేసేవారంతా ఆదాయపు పన్ను శాఖ నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకోవాలనే అర్థం వచ్చేలా ధ్వనించింది. దీంతో అందరు పౌరులు ఉలిక్కిపడ్డారు. గాభరా పడ్డారు. షాక్ తిన్నారు. ఎందుకంటే, మనం చూస్తూనే ఉన్నాం. ఎందరో తల్లిదండ్రులు తమ పిల్లల బాగోగులు చూసేందుకు, ఇంకా ఎన్నో కార్యక్రమాలు స్వయంగా చూసేందుకు విదేశాలకు వెళ్తున్నారు. 2023 మార్చి 31తో పోలిస్తే 2024 మార్చి 31 నాటికి పూర్తయిన ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య 15 శాతం పెరిగింది. ఈ ఆర్థిక సంవత్సరంలో 69.6 మిలియన్ల మంది విదేశీయానం చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో అన్ని రకాల వారూ ఉన్నారు. ఈ సంఖ్య ఇంకా గణనీయంగా పెరుగుతుందని అంచనా. ఆపాటి, ఈపాటి ప్రతి మధ్యతరగతి కుటుంబంలో విదేశీయానం చెయ్యని వారు లేరంటే అతిశయోక్తి కాదేమో. బడ్జెట్‌లో ఒక కొత్త మార్పు వచ్చింది. విదేశాల్లో ఉన్న ఆస్తులు, ఆదాయం మొదలైనవాటిని చూపించని ఎంతో మంది భారతీయ పౌరులు ఉన్నారు. బ్లాక్‌మనీ 2015 చట్టం ప్రకారం ఇలాంటి ఆస్తులను చూపించకపోవటం నేరం. ఇలాంటి వారి మీద దృష్టి పెడుతోంది డిపార్టుమెంటు. ఒకప్పుడు ఎవరు విదేశీయానం చేసినా, ప్రయాణానికి ముందు క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకోవాలని నిబంధన ఉండేది. దాన్ని సడలించారు. రద్దు చేశారని చెప్పారు. అంతేకాకుండా 1/4 బిఅని 1/6 అని షరతులు ఉండేవి. ఒక షరతు ప్రకారం స్వయంగా విదేశీయానం చేయకపోయినా 'టికెట్' కొని ఉంటే రిటర్నుల్లో చూపించాల్సి వచ్చేది. కాలక్రమేణా సరడలింపుల వల్ల అంతా మర్చిపోయారు. కానీ మొన్న బడ్జెట్‌లో ఈ ప్రస్తావన రావడంతో అందరిలోనూ గుబులు.. కానీ నిబంధన కొంతమందికే వర్తిస్తుంది. తల్లిదండ్రులెవరూ భయపడక్కర్లేదు. డిపార్టుమెంటుకి వెళ్లక్కర్లేదు. సర్టిఫికెట్ తీసుకోనవసరం లేదు. రిలాక్స్.. రిలాక్స్.. అందరికీ ఇది అవసరం లేదు. మీరంతా నిశ్చింతగా ప్లాన్ చేసుకోవచ్చు.




### ఎవరికి క్లియరెన్స్ సర్టిఫికెట్ కావాలి..

ఆర్థికపరంగా అవకతవకలు చేసినవారు, పది లక్షలు దాటి పన్ను చెల్లించాల్సిన వారు, ఈ పన్ను భారానికి 'స్టే' విధించకపోతే.. ఇటువంటి వారికి కావాలి. ఇది అరుదైన పరిస్థితి. అసాధారణ పరిస్థితి. ట్యాక్స్ చెల్లించకపోవడం నేరం. కట్టకుండా విదేశాలకు వెళ్లే వారి నుంచి .. అంటే డిఫాల్టర్ల నుంచి పన్ను వసూలు చేసే ప్రక్రియలో భాగంగా ఈ సర్టిఫికెట్ అడుగుతారు. పైన చెప్పిన రెండు షరతులు ఫిబ్రవరి 2004 నాడు జారీ చేసిన సూచన .. కాదు.. ఆదేశం అని అనాలి. అంటే 20 సంవత్సరాల మాట .. ఈ ఆదేశానికి, 2015 బ్లాక్ మనీ చట్టానికి లింకు కలిపారు. ఈ విషయాన్నే 2024లో ప్రస్తావించారు. ఇరవై సంవత్సరాల మాట .. ఇప్పుడు ప్రస్తావన తేవడంతో దురదృష్టవశాత్తూ ప్రజల్లో భయాందోళనలకు దారి తీసింది. ఏం గాభరాపడక్కర్లేదు. మీరు ఒక విజయ్ మాల్యాని .. ఒక నీరవ్ మోడీని ప్రస్తావించి గవర్నమెంటు మీద దుమ్మెత్తిపోయకండి. చట్టప్రకారం రిటర్ను వేయడం విధి. పన్ను చెల్లించడం తప్పనిసరి. ఆ దోవలో వెళ్తే మిమ్మల్ని ఎవరూ ఆపరు. అడ్డు చెప్పరు. ఆటంకపర్చరు. ఎయిర్‌పోర్టుకి ఎవరూ రారు. అయితే, ఒక సూచన. మీతోపాటు మీ పాన్‌కార్డు, మీరు అసెస్సీ అయితే లేటెస్ట్ రిటర్ను కాపీ పెట్టుకోండి. మీరు ఆదాయపు పన్ను పరిధిలో లేకపోయినా రిటర్నులు వేసే అవసరం లేకపోయినా.. అసెస్‌మెంట్ కాకపోయినా .. అసెస్‌మెంట్ ఆగిపోయినా 10 లక్షల లోపుల పన్నులు చెల్లించకపోయినా (మనలో మన మాట, బండి అంతవరకు పోనివ్వకండి) గాభరా పడక్కర్లేదు. క్షేమంగా వెళ్లి లాభంగా రండి. బాన్ వొయాజ్.. ఆల్ ద బెస్ట్.

# వైఎస్ జగన్ నిర్ణయాలకు కేంద్రం గుర్తింపు

- 'సులభతర వాణిజ్యం' అమలులో రెండో స్థానంలో ఏపీ
- సంస్కరణల అమలులో ఆంధ్రప్రదేశ్ పనితీరు భేష్
- కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడి
- ఈవోడీబీ-2022 ర్యాంకుల కోసం 25 రంగాల్లో సంస్కరణల ప్రతిపాదన
- 17 రాష్ట్రాలు ఈ సంస్కరణలు అమలు చేసి ర్యాంకుల కోసం పోటీ
- కేరళ తర్వాత స్థానం ఏపీదే
- కూటమి అబద్ధపు ప్రచారానికి చెంపపెట్టు



అమరావతి: రాష్ట్రంలో పెట్టుబడులను పెద్దఎత్తున ప్రోత్సహించేలా గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలకు మరోసారి గుర్తింపు లభించింది. సులభతర వాణిజ్య ర్యాంకులు (ఈవోడీబీ)-2022 ర్యాంకుల కోసం కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ రూపొందించిన వ్యాపార సంస్కరణల కార్యాచరణ ప్రణాళిక-2022 అమల్లో ఆంధ్రప్రదేశ్ రెండోస్థానంలో నిలిచింది. గుజరాత్, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక వంటి రాష్ట్రాల కంటే ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉంది. ఇదే విషయాన్ని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ రెండు రోజుల క్రితం న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రకటించారు. ఈ సందర్భంగా పీయూష్ గోయల్ ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న పారిశ్రామిక సంస్కరణలను ప్రశంసిస్తూ ఆంధ్రప్రదేశ్ పనితీరు భేష్ అని స్పష్టం చేశారు.

### కేరళ తర్వాత ఏపీయే టాప్

2022 ర్యాంకుల కోసం మొత్తం 25 రంగాల్లో (ఇందులో పరిశ్రమలకు సంబంధించి 15 రంగాలు, పౌరసేవలకు సంబంధించి 10 రంగాలు) మొత్తం 352 సంస్కరణలు అమలు చేయాల్సి ఉంది. ఈ సంస్కరణలు అమలు చేసినట్టు 17 రాష్ట్రాలు కేంద్రానికి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వగా.. అందులో కేరళ మొదటిస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో ఆంధ్ర, గుజరాత్, రాజస్థాన్, త్రిపుర ఉన్నాయి. తెలంగాణ చివరి నుంచి రెండో స్థానంలో నిలిచింది. ఈ సంస్కరణలు అమలు చేసిన తర్వాత వీటిని వినియోగించుకున్న వారిని ర్యాండమ్‌గా సర్వే చేసి వారు ఇచ్చిన స్పందన ఆధారంగా ర్యాంకులను ప్రకటిస్తారు. 2022 సంవత్సరానికి సంబంధించి ఈవోడీబీ ర్యాంకులను ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.



### కూటమి పార్టీలకు చెంపపెట్టు

రాష్ట్రం నుంచి పారిశ్రామికవేత్తలు పారిపోతున్నారని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వాతావరణం లేదంటూ ప్రచారం చేసిన కూటమి పార్టీలు టీడీపీ, జనసేన, బీజేపీలకు ఇది చెంపపెట్టు లాంటిందని పారిశ్రామికవేత్తలు వ్యాఖ్యానిస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా 100 శాతం పారిశ్రామికవేత్తల అభిప్రాయాల ఆధారంగా ప్రకటించిన ఈవోడీబీ ర్యాంకుల్లో వరుసగా మూడు సంవత్సరాలు మొదటి స్థానంలో నిలవడమే కాకుండా.. ఇప్పుడు సంస్కరణల అమలు విషయంలో రెండో స్థానంలో నిలవడమే దీనికి నిదర్శనమంటున్నారు. సులభతర వాణిజ్యం కోసం 'ఏపీ వన్' పేరిట సింగిల్ విండో విధానం ఏర్పాటు చేయడమే కాకుండా పారిశ్రామికవేత్తలను చేయిపట్టుకుని నడిపించారు. దీంతోనే డైకిన్, సెంచురీప్లై, ఏటీజీ, దివీస్, అరబిందో వంటి అనేక దిగ్గజ కంపెనీలు రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టాయి. గత ప్రభుత్వ విధానం వల్ల విద్యుత్ రంగంలో బ్రాండ్ ఏపీ విలువ మరమ్మతు చేయలేని విధంగా దెబ్బతిన్నదని టీడీపీ నిరంతరం ఆరోపించింది. ఇదే నిజమైతే.. అదానీ, గ్రీన్‌కో, అరేసెలార్ మిట్టల్ వంటి విస్తారమైన పేరున్న కంపెనీలు ఇంధన రంగంలో రూ.7,69,815 కోట్లు ఎలా పెట్టుబడి పెట్టాయంటూ పరిశ్రమల శాఖ మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు.

### ప్రకాశం బ్యారేజీని ఢీకొన్న బోట్లు వైకాపా నేతలవే..

## సీఎం చంద్రబాబుకు అధికారుల నివేదిక



అమరావతి: ప్రకాశం బ్యారేజీకి బోట్లు ఢీకొన్న ఘటనపై సీఎం చంద్రబాబుకు అధికారులు నివేదిక సమర్పించారు. ఈ సంఘటనలో కుట్ర కోణం ఉందని నివేదికలో వెల్లడించారు. ఢీకొన్న బోట్లు వైకాపా నేతలు.. కార్యకర్తలవని నిర్ధరించారు. వైకాపా ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, మాజీ ఎంపీ నందిగం సురేష్ అనుచరుల బోట్లుగా గుర్తించినట్లు నివేదికలో వెల్లడించారు. ఇసుక అక్రమ తవ్వకాలకు నందిగం సురేష్.. ఉషాద్రికి చెందిన బోట్లనే వినియోగించుకునే వారని చెప్పారు. బోట్ల రిజిస్ట్రేషన్ల నెంబర్ల ద్వారా యజమానులను గుర్తించామన్నారు. ప్రకాశం బ్యారేజీని ఢీకొన్న బోట్లను ఉషాద్రి, కర్రి నరసింహా స్వామి, గూడూరు నాగమల్లేశ్వరీలకు చెందినవిగా గుర్తించారు. ఉషాద్రికి చెందిన మూడు బోట్లను కలిపి కట్టడం వెనుక కుట్ర కోణం ఉందని చెప్పారు. సహజంగా మూడింటిని కలిపి కట్టరని నివేదికలో వ్యాఖ్యానించారు. వాటికి ఇనుప చైన్ల లంగరు వేయకుండా ప్లాస్టిక్ తాళ్లతో కట్టేసినట్లు పేర్కొన్నారు. తమ బోట్లతో పాటు సమీపంలోని మరో రెండింటిని కూడా కొట్టుకెళ్లేలా కుట్ర చేశారని తెలిపారు. సెప్టెంబర్ 2న తెల్లవాన 3 గంటల సమయంలో 5 బోట్లు ప్రకాశంరు జాము బ్యారేజీ గేట్లను ఢీ కొట్టినట్టు నివేదికలో స్పష్టం చేశారు. అవి గేట్లకు ఉండే కౌంటర్ వెయిట్‌లకు కాకుండా బ్యారేజీ పిల్లర్లను బలంగా ఢీకొడితే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండేదని తెలిపారు. మరోవైపు పోలీసులు నిందితుల కాల్ డేటాను విశ్లేషిస్తున్నారు.

## భారీ వర్ష సూచన.. ఉత్తర కోస్తాకు రెడ్ అలర్ట్ జారీ!



అమరావతి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఏపీలోని ఉత్తర కోస్తా, గోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో వరుసగా రెండోరోజూ సోమవారం కూడా ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది.దీంతో భారీగా వరదనీరు పోటెత్తి రోడ్లు, పొలాలు నీట మునిగాయి. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీరు కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి.దీంతో మరోసారి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పోర్ట్ మెటియోలాజికల్ ఆఫీసుల పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది.దీంతో విద్యా సంస్థలకు అధికారులు సెలవు ప్రకటించారు. ముఖ్యంగా శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ కలెక్టర్లు అలర్ట్ అయ్యారు. మరోవైపు అల్లూరి సీతారామరాజు జిల్లాలో భారీ వర్షం కారణంగా కొండచరియలు విరిగిపల్లి జిల్లాలోని తాండవ, కల్యాణపులోవ రిజర్వాయర్లు ప్రమాదకర స్థాయికి జలాశయం రెంచేరుకున్నాయి. దీంతో తాండవడే ప్రమాదం ఉండటంతో ఘాట్ రోడ్లను మూసివేశారు. అనకాప డు గేట్లను ఎత్తి 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. చెరువులు పొంగి పొర్లడంతో ముందుజాగ్రత్త చర్యగా నర్సీపట్నం-తుని మధ్య రహదారిని అధికారులు మూసివేశారు. అటు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలకు ఐఎండీ రెడ్ అలర్ట్ ప్రకటించింది.

## హైదరాబాద్ సీపీగా బాధ్యతలు చేపట్టిన సీవి ఆనంద్



**హైదరాబాద్, :** హైదరాబాద్ సీపీగా సీవి ఆనంద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రెండోసారి హైదరాబాద్ సీపీగా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ అవకాశం ఇచ్చినందుకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం వినాయక చవితి, మిలాద్ ఉన్ నబి పండుగలు ఉన్నాయి.. పండుగలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూస్తామని చెప్పారు. గతేడాది కూడా రెండు పండుగలు ఒకేసారి వచ్చాయి. అప్పుడు ప్రశాంతంగా జరిపాం. ప్రస్తుతం అన్ని రకాలుగా యాక్షన్ ప్లాన్ సిద్ధంగా ఉందని చెప్పారు. పండుగ ఏర్పాట్లకు సంబంధించి అధికారులతో సమీక్ష నిర్వహిస్తానని అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అనేది పార్ట్ ఆఫ్ పోలీసింగ్ గా కొనసాగుతుంది. ప్రజలు తప్పుగా అపార్థం చేసుకుంటున్నారని సీవీ ఆనంద్ అన్నారు. నగర వ్యాప్తంగా క్రిమినల్స్ పై ఉక్కుపాదం మోపుతామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ పై సీరియస్ గా ఉందని, డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు కృషి చేస్తామని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి పూర్తి వివరాలు తీసుకుంటానని సీవీ ఆనంద్ పేర్కొన్నారు. సీవీ ఆనంద్ నగర సీపీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పలువురు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. సీవీ ఆనంద్ ఇంతకుముందు కూడా హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేశారు. 2021, డిసెంబర్ 24 నుంచి 2023 అక్టోబర్ 12 వరకు హైదరాబాద్ సీపీగా కొనసాగారు. అంతకుముందు ఆయన కేంద్ర సర్వీసుల్లో అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా సేవలు అందించారు. 2017లో రాష్ట్రపతి పోలీసు పతకంతో పాటు ఇన్నోవేటివ్ లీడర్‌షిప్ అవార్డు కూడా అందుకున్నారు.

## నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద ఉధృతి..



నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతుంది. నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 24 గేట్లు ఎత్తి నీటిని దిగువలకు విడుదల చేస్తున్నారు అధికారులు. 20 గేట్లు 5 అడుగులు, 4 గేట్లు 10 అడుగుల మేర పైకి ఎత్తి 2,17,724 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు అధికారులు. ఇన్ ఫ్లో : 2,59,730 క్యూసెక్కులు కాగా.. ఔట్ ఫ్లో : 2,59,730 క్యూసెక్కులుగా కొనసాగుతుంది. ప్రస్తుత నీటి మట్టం: 588.50 అడుగులు కాగా.. పూర్తి స్థాయి నీటి మట్టం : 590.00 అడుగులుగా కొనసాగుతుంది. ప్రస్తుతం ప్రాజెక్టు లో నీటి నిల్వ : 307.5790 టీఎంసీలుగా కొనసాతుంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం : 312 టీఎంసీలుగా ఉంది. సాగర్ గేట్ల ఎత్తివేయడంతో చూసేందుకు పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చి కృష్ణమ్మ అందాలను తిలకించారు. బుద్ధవనం, నాగార్జునకొండ మ్యూజియం, సమ్మక్క సారక్క, ప్రధాన ఆనకట్ట, శివాలయం ఘాట్, పవర్ హౌస్, ఉట్టిపిప్తల, అనుపు, కొత్త వంతెన, పాత వంతెన, ప్రధాన ద్వారాలు, కొత్త వంతెన తదితర ప్రాంతాలు పర్యాటకులతో కిక్కిరిసిపోయాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా మిడ్ మానేరు ప్రాజెక్టు నుంచి ఎల్‌ఎండికి నీటి వరద కొనసాగుతుంది. జలాశయం ఏడు గేట్ల ద్వారా 19900 క్యూసెక్కుల నీరును వదులుతున్న అధికారులు. అన్నపూర్ణ జలాశయానికి 6400 క్యూసెక్కులు కాగా.. మీడ్ మానేరుకు ఎస్సారెస్పీ నుంచి 13 వేలు, మానేరు మూల వాగు నుంచి 2617 క్యూసెక్కుల ఇన్ఫ్లో.. మిడ్ మానేరు ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు (318 మీటర్లు) కాగా.. ప్రస్తుతం జలాశయంలో 23.11 టీఎంసీలు (316.20 మీటర్లు)గా కొనసాగుతుంది.

# వామ్మో మంకీపాక్స్!.. భారత్‌లో అనుమానిత కేసు

**వైరస్ ఉన్న దేశం నుంచి వచ్చిన యువకునిలో లక్షణాలు**

**ఆసుపత్రిలో ఐసోలేషన్‌లో ఉంచి చికిత్స**

**ఆందోళన అవసరం లేదు: కేంద్రం**

**ప్రపంచ దేశాలను వణికిస్తున్న ప్రాణాంతక మంకీపాక్స్ (ఎంపాక్స్) వైరస్ సెగ భారత్‌కూ తాకింది.**





మన దేశంలో తాజాగా 'అనుమానిత' ఎంపాక్స్ కేసు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఎంపాక్స్ వ్యాప్తి అధికంగా ఉన్న ఓ దేశం నుంచి వచ్చిన యువకుడిలో వైరస్ లక్షణాలను గుర్తించినట్లు ఆదివారం ప్రకటన విడుదల చేసింది. "బాధితుడిని ఆసుపత్రిలో చేర్చి ఐసోలేషన్‌లో ఉంచాం. అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. అతడితో కలిసి ప్రయాణించిన వ్యక్తులను గుర్తిస్తున్నాం. అతనికి నిజంగా ఎంపాక్స్ సోకిందీ లేనిదీ నిర్ధారించడానికి నమూనాలు సేకరించి పరీక్షిస్తున్నాం" అని పేర్కొంది. "ఇది అనుమానిత కేసే. ఇంకా నిర్ధారణ కాలేదు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు" అని తెలిపింది. వైరస్ విషయంలో ఏ పరిణామాలనైనా ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నట్లు వివరించింది.

### 99,176 కేసులు.. 208 మరణాలు

యూరప్, ఆఫ్రికా దేశాల్లో ఇటీవల మంకీపాక్స్ వైరస్ కేసులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దాంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ మంకీపాక్స్‌ను 'అంతర్జాతీయ ఆరోగ్య విపత్తు'గా ఆగస్టు 14న ప్రకటించింది. ఈ వైరస్ వ్యాప్తి 2022లో వెలుగులోకి వచ్చింది. ఇటీవల ఆఫ్రికాలో కొత్త రకం ఎంపాక్స్ పుట్టుకొచ్చినట్లు తేలింది. 2022 వైరస్ కంటే ఇది మరింత ప్రాణాంతకమని తేలింది. కొత్త వైరస్ లైంగిక సంబంధాల ద్వారా కూడా వ్యాప్తి చెందుతుందని నిపుణులు చెబుతున్నారు. 2022 నుంచి 2023 దాకా 116 దేశాల్లో 99,176 ఎంపాక్స్ కేసులు నమోదయ్యాయి. 208 మంది మరణించారు. 2024లో 15,600కు పైగా కేసులు నమోదయ్యాయి. 537 మంది మృతిచెందారు. 2022 నుంచి భారత్‌లో కనీసం 30 ఎంపాక్స్ కేసులు నమోదయ్యాయి. చివరిసారిగా ఈ మార్చి నెలలో ఒక కేసు బయటపడింది.

### ఏమిటీ ఎంపాక్స్?

1958లో తొలిసారిగా కోతుల్లో ఈ వైరస్‌ను కనుగొన్నారు. అందుకే దీనికి మంకీపాక్స్ పేరు స్థిరపడిపోయింది. అప్పట్లో పరిశోధన కోసం డెన్మార్క్‌కు తరలించిన కోతుల్లో కొత్త రకం వ్యాధి లక్షణాలు కనిపించడంతో ల్యాబ్ పరీక్షలు జరిపి ఈ వైరస్ ఉనికి కనిపెట్టారు. మనుషుల్లో దీన్ని 1970లో తొలిసారిగా గుర్తించారు. కాంగోలో తొమ్మిదేళ్ల బాలుడికి ఈ వైరస్ సోకింది. మనుషులు, చిట్టెలుకలకూ వైరస్ సోకుతుండటంతో ఎంపాక్స్ అనే పొట్టిపేరు ఖరారుచేశారు. దశాబ్దాల క్రితం లక్షలాది మందిని పొట్టనబెట్టుకున్న మశూచి కారక వైరస్, ఎంపాక్స్ ఒకే జాతికి చెందినవి. గోవులకు సోకే గో మశూచి, వసీనియా వంటి వ్యాధులను కల్గించే వైరస్ కూడా ఈ రకానిదే.

### ఇలా సోకుతుంది

అప్పటికే వైరస్ సోకిన మనుషులు లేదా జంతువులను తాకినా, వారితో దగ్గరగా గడిపినా వైరస్ సోకుతుంది. కుక్క లేదా ఇతరత్రా పెంపుడు జంతువులకు వైరస్ సోకితే అవి మనుషులను కరిచినా, తాకినా, వాటి లాలాజలం, రక్తం, ఇతర స్రావాలు అంటుకున్నా సోకుతుంది. చర్మంపై గాయాలు, శరీర స్రావాలు, తుమ్మినపుడు పడే తుంపర్లు, నోటి లాలాజలం ఇలా వైరస్‌కు ఆవాసయోగ్యమైన ప్రతి తడి ప్రాంతం నుంచీ సోకుతుంది. రోగి వాడిన దుస్తులు, వస్తువులను ముట్టుకున్నా, వాడినా, ముఖాన్ని ముఖంతో తాకినా, కరచాలనం చేసినా, ముద్దుపెట్టుకున్నా సోకొచ్చు. తల్లి నుంచి బిడ్డకు సంక్రమించవచ్చు.

### వ్యాధి లక్షణాలు ఏమిటీ?

ఎంపాక్స్ సోకితే చర్మం ఎర్రగా మారి పొక్కులొస్తాయి. సొన చేరి పొక్కులు ఇబ్బంది పెడతాయి. చర్మంపై దద్దుర్లతోపాటు జ్వరం, భరించలేని తలనొప్పి, కండరాల నొప్పి, వెన్ను నొప్పి వస్తాయి. 90 శాతం కేసుల్లో ముఖంపై, 75 శాతం కేసుల్లో అరచేతులు, పాదాల మీద, 30 శాతం కేసుల్లో జననాంగాల మీద పొక్కులొస్తాయి. నీటి బొడిపెలుగా పెద్దవై సొన చేరి ఎర్రగా, నల్లగా మారి పగులుతాయి. నీరసంగా ఉంటుంది. గొంతెండిపోతుంది.

### వ్యాక్సిన్ ఉందా?

స్వల్ప లక్షణాలు కనిపిస్తే వ్యాధి దానంతట అదే తగ్గిపోతుంది. ప్రస్తుతానికి ఎంపాక్స్‌కు నిర్దిష్టమైన చికిత్స విధానం, వ్యాక్సిన్ లేవు. మశూచికి వాడే టికోవిరమాట్ (టీపీఓఎక్స్ ఎక్స్) యాంటీ వైరల్‌నే దీనికీ వాడుతున్నారు. అమెరికాలో మశూచికి వాడే జెనియోస్ (ఇమ్వామ్యూన్, ఇంవానెక్స్) డ్రగ్స్‌నే 18 ఏళ్ల పై బడిన రోగులకు ఇస్తున్నారు. కోవిడ్ దెబ్బకు సంపన్న దేశాల్లో మాదిరిగా నివారణ చర్యలు, నిర్ధారణ పరీక్షల వంటివి లేక ఆఫ్రికా దేశాల్లో వైరస్ విజృంభిస్తోంది.

### అప్రమత్తంగా ఉండండి: కేంద్రం

పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల్లో ఎంపాక్స్ కేసులు పెరిగిపోతుండటంతో సరిహద్దులతోపాటు ఎయిర్‌పోర్టులు, ఓడరేవుల్లో అప్రమత్తంగా ఉండాలని కేంద్రం సర్క్యులర్ జారీ చేసింది. ఎంపాక్స్ లక్షణాలు గుర్తించడానికి విదేశాల నుంచి వచ్చేవారికి పరీక్షలు నిర్వహించాలని సూచించింది. ఎంపాక్స్ సన్నద్ధతపై ప్రధాని ముఖ్య కార్యదర్శి పి.కె.మిశ్రా తాజాగా ఉన్నతస్థాయి సమీక్ష జరిపారు. ఈ కేసుల్లో సమర్థ చికిత్స కోసం ఆసుపత్రులను ఇప్పట్నుంచే సిద్ధం చేసుకోవాలని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది.

### సునీత, విల్మోర్ లేకుండా ఖాళీగానే ఐఎస్ఎస్ నుంచి భూమికి

# తిరిగొచ్చిన స్టార్‌లైనర్



వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్‌తో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి(ఐఎస్ఎస్) వెళ్లిన స్టార్ లైనన్ స్పేస్‌క్రాఫ్ట్ ఒంటరిగానే తిరిగొచ్చింది. ఆరు గంటల ప్రయాణం తర్వాత స్థానిక కాలమానం ప్రకారం శనివారం ఉదయం 9.31 గంటలకు అమెరికాలో న్యూమెక్సికో ఎడారిలోని వైట్ శాండ్ స్పేస్ హార్బర్ సమీపంలో క్షేమంగా దిగింది. ఐఎస్ఎస్ నుంచి కేవలం 10 రోజుల్లో తిరిగి రావాల్సిన స్టార్ లైనర్ సాంకేతిక లోపాల వల్ల మూడు నెలలకు పైగా ఆలస్యంగా భూమిపై అడుగుపెట్టింది. స్టార్ లైనర్‌లో వెనక్కి రావాల్సిన సునీత, విల్మోర్ ఐఎస్ఎస్‌లోనే ఉండిపోయారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వారు భూమిపైకి తిరిగి వచ్చే అవకాశం ఉంది. అప్పటిదాకా ఐఎస్ఎస్‌లోనే ఉండి, అంతరిక్ష పరిశోధనల్లో పాలుపంచుకోనున్నారు. ప్రపంచ అంతరిక్ష ప్రయోగాల చరిత్రలో వ్యోమగాములతో అంతరిక్షంలోకి వెళ్లి, ఒంటరిగా తిరిగివచ్చిన మొట్టమొదటి స్పేస్‌క్రాఫ్ట్‌గా స్టార్ లైనర్ రికార్డుకెక్కింది.

### ఏమిటీ స్టార్ లైనర్?

ప్రఖ్యాత బోయింగ్ సంస్థ అభివృద్ధి చేసిన తొలి అంతరిక్ష వాహక నౌక స్టార్ లైనర్. ఈ ఏడాది జూన్ 5వ తేదీన ప్రయోగాత్మకంగా ఇద్దరు వ్యోమగాములతో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపించారు. సునీతా విలియమ్స్, విల్‌మోర్ స్టార్ లైనర్‌లో ఐఎస్-ఎస్‌కు చేరుకున్నారు. ప్రయాణం మధ్యలో ఉండగానే సాంకేతిక లోపాలు తలెత్తాయి. ఇంజన్‌లోని కొన్ని థ్రస్టర్లు విఫలమయ్యాయి. హీలియం గ్యాస్ లీకైనట్లు గుర్తించారు. తాత్కాలిక మరమ్మత్తులతో స్టార్ లైనర్ ఐఎస్ఎస్‌తో అనుసంధానమైంది. వాస్తవానికి సునీతా విలియమ్స్, విల్‌మోర్ 8 రోజులపాటు అక్కడే ఉండి, ఇదే స్టార్‌లైనర్‌లో వెనక్కి తిరిగిరావాలి. మరమ్మత్తులు చేయడం సాధ్యం కాకపోవడంతో వారిని వెనక్కి తీసుకొచ్చే అవకాశం లేకుండాపోయింది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో స్పేస్‌ఎక్స్ సంస్థకు చెందిన 'డ్రాగన్' స్పేస్‌క్రాఫ్ట్‌లో వారిద్దరూ భూమిపైకి తిరిగి రానున్నారు. 'డ్రాగన్'లో నలుగురు వ్యోమగాములు ప్రయాణించడానికి వీలుంది. కానీ, ఇద్దరే ఐఎస్ఎస్‌కు వెళ్లనున్నారు. వచ్చేటప్పుడు సునీతా విలియమ్స్, విల్‌మోర్‌ను కూడా తీసుకురానున్నారు.

# జగమంతా దగా చేసినా



పెద్దగా ఏమీ మార్పు ఉండదు. తెల్లవారి టీకొట్టు దగ్గర పెద్దమనిషి ఎప్పటిలాగే న్యూస్‌పేపర్‌ని మడతపెట్టి చదువుతుంటాడు. పిల్లల్ని తీసుకెళ్లే స్కూల్‌బస్ వారిని గోలగోలగా మోసుకెళుతూ ఉంటుంది. సూర్యుడు ప్రసరింప చేస్తున్న ఎండ జామచెట్టుపై పడి కింద నీడను పరుస్తూ ఉంటుంది. చెరువులో నీళ్లు అదే నిమ్మళంతో ఉంటాయి. లీవులున్నా పెట్టలేని ఉద్యోగాల హాజరీకి అందరూ తయారవుతూ ఉంటారు. వారికై వంటగదుల్లో సాగే ఇల్లాళ్ల హడావిడి ఏమీ మారదు. ఢిల్లీలో తెల్లవారుతుంది. ముంబైలో తెల్లవారుతుంది. పాలకులు పట్టు పరుపుల మీద నుంచి లేచి పనుల్లో పడతారు. సకల మానవ జీవన వ్యాపారాలకు చీమైనా కుట్టదు. కబురు తెలిసిన కొందరు ఆత్మీయులు కూడా 'తొందరగా టిఫెను పెట్టు. తినేసి వెళతాను' అనే బయలుదేరుతారు. మీరు ఆత్మహత్య చేసుకుని మరణించారు. అది మీకూ మీ ఇంటికీ. మిగిలిన లోకానికి ఏంటట? ఆత్మహత్య చేసుకుని మరణించిన రైతుకు ఏ శిక్షా విధించలేక 'పోయి నీ కుటుంబం ఎలా ఉందో చూసిరా' అని పంపిస్తాడు దేవుడు- అదే శిక్షగా. చేసిన అప్పుకు ఎడ్లు జమ అయితే పొలంలో భార్యే ఎద్దులా కష్టపడుతూ ఉంటుంది. బడికెళ్లాల్సిన కూతురు తల్లికి సాయం చేస్తూ 'మా... అందుకే నిన్ను నాన్న తిడతాండె. చూడు... పడిన చోట నాలుగైదు ఇత్తనాలు పడినాయి. లేనిచోట్ల లేనే లేవు. ఇట్లైనా ఇత్తనమేసేది' అని తండ్రిని తలుచుకుంటూ ఆరిందాలా గద్దిస్తూ ఉంటుంది. భర్త గుర్తొచ్చిన తల్లి బొరుమని పొలంలో కూలబడుతుంది. గాలిరూపంలో ఉన్న రైతు అది చూసి ఎంత లబలబలాడినా ఏమొస్తుంది- ప్రాణమే వదులుకొని వచ్చేసినాక. బండి నారాయణ స్వామి కథ 'రంకె' ఇది. మొన్న హైదరాబాద్‌లో ఒక తండ్రి- చిన్న టీకొట్టు నడుపుకునే తండ్రి- స్కూలుకెళ్లకుండా హఠం చేస్తున్న పిల్లల్ని కొట్టి, ఎందుకు కొట్టానా అని తీవ్రమైన కలతతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఇప్పుడా పిల్లలకు స్కూలుకు వెళ్లమని చెప్పే తండ్రి లేడు. స్కూల్ ఫీజు కట్టే తండ్రి లేడు. ఏ రాత్రో కొట్టు కట్టేసి ఇల్లు చేరి నిద్రపోతున్న పిల్లల్ని చూసి భార్యతో 'నిద్రపోయారా పిల్లలూ' అనడుగుతూ ప్రేమగా వారి తలను నిమిరే తండ్రి లేడు. ఖాళీ టీకొట్టు ఉంది. దాని ముందు ట్రాఫిక్కు ఏమెరగనట్టుగా ఉంది. ఇరుగు పొరుగు షాపులలో బేరాలు యథావిధిగా జరుగుతూనే ఉన్నాయి. అతడు లేడు. అతనికీ- ఇంటికీ.

మృత్యువుకు మోహగుణం ఉంటుంది. 'నా పరిష్వంగంలోకిరా విముక్తి సుఖం ఇస్తాను' అని పిలుస్తూ ఉంటుంది. అందుకోసం అది సముద్రంలోని నీలి కెరటాలకు మరింత నీలిమ ఇస్తుంది. నది ప్రవాహానికి మరింత చిక్కదనం ఇస్తుంది. దూకే వరకు బావినీళ్లను మెరుపు అద్దంలా మారుస్తుంది. పురుగుల మందుకు ఎంత రుచి ఇస్తుందో. ధగధగమని మండే మంటకు మంచుకంటే చల్లనైన గుణం ఉంటుందనే ప్రలోభం కలిగిస్తుంది. ఒక్క మృత్యువు. వేయి ఆకర్షణలు. కాని జీవితానికి వేయిన్నొక్కటి. ఆ ఒక్కటికై బతకాలి. 'మృత్యువా... నీవొక అందమైన కవితా పంక్తివి. నిను కలుస్తాననే వాగ్దానాన్ని మరువను' అంటాడు 'ఆనంద్' సినిమాలో రాజేష్ ఖన్నా. జీవితం అంటే ఏమిటి? చనిపోవడానికి ముందు దొరికే కాసింత సమయం. కేన్సర్ డయాగ్నసిస్ అయ్యి రెండు మూడు నెలల్లో పోతానని తెలిశాక ఆనంద్ ప్రతి నిమిషం జీవించడానికి ఉబలాటపడతాడు. తెలిసినవారినీ తెలియనివారినీ తన అభిమానంలో ముంచెత్తుతాడు. బతికేది కాసిన్ని రోజులే అయినా గాఢంగా ఎన్నటికీ మరువనంతగా ముద్రలేసి వెళతాడు. చావు ఎప్పుడో తెలిసిన అతడే, జబ్బు మనిషి అతడే అలా బతికితే ఇవాళ్టికి అంతా బాగున్న మనం ఎలా బతకాలి? అవునండీ. భార్యాభర్తల మధ్య కీచులాటలు వస్తాయి. డబ్బుల కటాకటీ ఉంటుంది. బాస్ నరకం చూపుతుంటాడు. స్నేహితులు ద్రోహం చేస్తారు. బంధువులు వంచిస్తారు. సొంత తోబుట్టువులు ఊహించని నొప్పి కలిగిస్తారు. అనారోగ్యాలు ఉంటాయి. పంటల్లో నష్టం వస్తుంది. అయితే? చనిపోవడమేనా? ఇవాళ్టిని ఇవాళ్టితో ముగించడమేనా? ఎవరు ఇచ్చారు ఈ హక్కు? ఎవరి ఆమోదంతో తీసుకున్నారు ఈ నిర్ణయం? 'ఆత్మహత్య మహాపాతకం' అంది హిందూ ధర్మం. 'ఏ ఆయుధంతో ఆత్మహత్య చేసుకున్నాడో అదే ఆయుధంతో పైన దండింపబడతాడు' అంది ఇస్లాం ధర్మం. బతికి ఉండగా బతకడానికి చేసిన అన్ని తప్పొప్పులకైనా కన్సిడరేషన్ ఉందిగాని ఆత్మహత్య చేసుకుంటే నేరుగా నరకానికే. చచ్చాక సుఖపడదామనుకునే వారికి పైన ఎన్ని చచ్చే చావులు ఉన్నాయో ఏం తెలుసు? దాని బదులు బతకొచ్చుగా హాయిగా? ఏమిటి... పరువు పోయిందా... చచ్చిపోతారా? మన పరువును ఎంచేంత పరువు ఈ సమాజానికి ఉందంటారా ఇప్పుడు? 'మనసు కాస్త కలత పడితే మందు ఇమ్మని మరణాన్ని అడగకు' అన్నాడు సిరివెన్నెల. సెప్టెంబర్ 10- ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం. అసలు ఈ పేరే సరి కాదు. దీనిని 'ప్రపంచ జీవన కాంక్షా దినోత్సవం' అని మార్చాలి. జీవనకాంక్ష... ఇదే కావాల్సింది. ఎవరూ కష్టాలకు మినహాయింపు కాదు. ఎవరినీ సవాళ్లు ఒదిలిపెట్టవు. ఉక్కిరిబిక్కిరి అయ్యే క్షణాల వాయిదాలవారీ పంపకమే జీవితం. ఇది అందరికీ తెలుసు. అందుకే అర్ధాంతరంగా మరణించిన వారికి గౌరవం లేదు. 'ఏం.. మేం బతకట్లేదా.. చచ్చేం సాధించాలి గనక' అనుకుంటారు. అందుకే ఓడినా సరే బతికి తీరాలి. సినారె అంటాడు- 'జగమంతా దగా చేసినా చివురంత ఆశను చూడు... గోరంత దీపం కొండంత వెలుగు... చివురంత ఆశ జగమంత వెలుగు'. ఏం మహాశయా... బతికేద్దామా? బతుకుదాం లేద్దూ!

## భారత రెజ్లర్ బజరంగ్ పునియాకు బెదిరింపులు



**న్యూఢిల్లీ,:** భారత స్టార్ రెజ్లర్ బజరంగ్ పునియా ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. అయితే.. బజరంగ్ పునియాకు తాజాగా బెదిరింపులు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీలో చేరిన రెండ్రోజుల వ్యవధిలోనే ఆయనకు వాట్సాప్ మెసేజ్‌ల రూపంలో బెదిరింపులు రావడం కలకలం రేపుతోంది. బెదిరింపులు వచ్చిన తర్వాత బజరంగ్ పునియా పోలీసులను ఆశ్రయించారు. సోనిపట్‌లోని బహల్ఘర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాంగ్రెస్ పార్టీని వీడాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని వాట్సాప్ మెసేజ్‌లో తనని హెచ్చరించారని బజరంగ్ పునియా తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇక అతని ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించారు. హర్యానాలో త్వరలోనే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, బజరంగ్ పునియా హస్తం పార్టీలో చేరారు. దాంతో.. ఆ రాష్ట్రంలో రాజకీయాలు రసవత్తరంగా కనిపిస్తున్నాయి. గత శుక్రవారం మధ్యాహ్నం కాంగ్రెస్‌లో చేరారు. కేసీ వేణుగోపాల్ వీరిద్దరికీ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే నెలలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వినేశ్ ఫొగాట్, బజరంగ్ పునియా పోటీ చేసే అవకాశాలు ఉన్నాయని పలువురు కాంగ్రెస్ నేతలు అంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత వినేశ్, బజరంగ్ పునియా ఇద్దరూ రైల్వే ఉన్న ఉద్యోగాలకు రాజీనామా చేశారు. హర్యానాలోని 90 అసెంబ్లీ స్థానాలకు అక్టోబర్ 5వ తేదీన ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఆ తర్వాత 8వ తేదీన ఎన్నికల ఫలితాలు వెల్లడి అవుతాయి.

## పార్టీ మార్పుపై మల్లారెడ్డి సంచలన వ్యాఖ్యలు.. భలే అన్నారుగా!



**హైదరాబాద్, :** తెలంగాణ రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉండే బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి.. పార్టీ మార్పుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు పాలనను మెచ్చుకున్నారు. "నేను కోరిన కోర్కెలు తీర్చిన ఆ వేంకటేశ్వరుడికి.. నడక మార్గం గుండా తిరుమలకు చేరుకొని మొక్కులు చెల్లించుకున్నా" అన్న రేవంత్ రెడ్డి.. "ఏపీలో చంద్రబాబు సువర్ణ పాలన ప్రారంభం అయ్యింది. 74 ఏళ్ల వయస్సులో చంద్రబాబు తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ సహాయక చర్యలు పరిశీలిస్తున్నారు. వరద నీటిలోనే 30 కిలోమీటర్లు పర్యటించి ప్రజలను కాపాడిన ఘనత చంద్రబాబుదే" అని మెచ్చుకున్నారు. ఇంకా మల్లారెడ్డి చంద్రబాబును అనేక రకాలుగా ప్రశంసించారు. "చంద్రబాబుకి ఉన్న అనుభవంతో పెద్ద ఎత్తున విపత్తు నుంచి ప్రజలను ఆదుకున్నారు. వర్షాలు తక్కువ అవ్వాలనీ, తెలంగాణ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థించాను. రైతులు ఆత్మహత్య చేసుకోకూడదని కోరుకున్నాను" అని విలేఖరులకు తెలిపారు. అది సరే.. పార్టీ మారుతున్నారా? అని అడిగితే.. మల్లారెడ్డి వెంటనే స్పందించలేదు. మరి విలేఖరులు ఊరుకుంటారా.. వెంటపడి మరీ.. చెప్పండి అని అడిగారు. దాంతో ఆయన.. "నేను ఏ పార్టీలోకీ వెళ్లడం లేదు. అవసరం వస్తే చెప్తా" అని అన్నారు. తద్వారా పార్టీ మార్పుపై ఆయన ప్రస్తుతానికి ఏ నిర్ణయమూ తీసుకోలేదని అనుకోవచ్చు. అదే సమయంలో.. అవసరం వస్తే చెబుతా అని అనడం ద్వారా.. అవసరమైతే.. పార్టీ మారేందుకు కూడా ఆయన వెనకడుగు వేయరనే సంకేతాన్ని బీఆర్ఎస్ పార్టీకి ఇచ్చినట్టైంది. మల్లారెడ్డి బీఆర్ఎస్ పార్టీలోనే ఐదేళ్లూ ఉంటారన్న గ్యారెంటీ లేదు. ఎందుకంటే ఆయన రాజకీయ వేత్త మాత్రమే కాదు.. వ్యాపారవేత్త కూడా. సాధారణంగా వ్యాపారవేత్తలు ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే, ఆ ప్రభుత్వానికి అనుకూలంగా మారిపోతుంటారు. మల్లా రెడ్డి కూడా అంతే. ఆయన కాంగ్రెస్‌ని ఏమీ అనకుండా సైలెంటుగా ఉన్నారు. అందువల్ల ఏ క్షణమైనా.. పార్టీ జంప్ అయ్యే ఛాన్స్ ఉంది. ఐతే.. ఇప్పుడు ఎమ్మెల్యేల అనర్హత అంశం కాకమీద ఉంది. ఇలాంటప్పుడు మల్లా రెడ్డి.. పార్టీ మారాలనుకుంటే, బీఆర్ఎస్‌కి రాజీనామా చేసి, మారడం మేలు. లేదంటే అనర్హత వేటు పడే ప్రమాదం ఉంటుంది. అందుకే ఆయన దాటవేసే ధోరణితో మాట్లాడారు. తెలంగాణ రాజకీయాల్లో మాత్రం మల్లారెడ్డి పార్టీ మారడం పక్కా అనే టాక్ వినిపిస్తోంది.

## ఇంటింటి సర్వేకి ఇతర జిల్లాల ఉద్యోగులు
## విజయవాడ వరదలపై చంద్రబాబు ఆర్డర్



**అమరావతి,:** భారీ వర్షాలు, వరదల కారణంగా విజయవాడ నగరం అతలాకుతలం అయ్యింది. విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇంటింటి సర్వే చేసి ఎంతెంత నష్టం జరిగింది అంటూ పూర్తి నివేదిక ఇవ్వాలని సీఎం చంద్రబాబు నాయుడు సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విజయవాడలోని వరద బాధిత ప్రాంతాల్లో ఇంటింటి సర్వే చెయ్యడానికి ఇతర జిల్లాల నుంచి రెవెన్యూ అధికారులు విజయవాడ చేరుకుంటున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 19 మంది తహసిల్దార్లు, 42 మంది రెగ్యులర్ డిప్యూటీ తహసిల్దార్ల, 67 మంది రెవెన్యూ ఇన్స్ పెక్టర్లు, సీనియర్ అసిస్టెంట్లు, 64 మంది వీఆర్‌ఓలు, 18 మంది రీసర్వే డీటీలు విజయవాడ చేరుకున్నారు. సోమవారం ఉదయం విజయవాడ చేరుకున్న అనంతపురం జిల్లా రెవెన్యూ అధికారులు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇంటింటి సర్వే చేయడానికి రంగంలోకి దిగారు. ఇంకా కొంత మంది అధికారులు సోమవారం మధ్యాహ్నం, సాయంత్రం విజయవాడ చేరుకునే అవకాశం ఉంది. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన 210 మంది రెవెన్యూ ఉద్యోగులులు విజయవాడలో ఇంటింటి సర్వే చెయ్యాలని వారిని డిప్యూటేషన్ పై నియమిస్తూ కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ రెండు రోజుల క్రితం ఆదేశాలు జారీ చేశారు. విజయవాడలో వరద పీడిత ప్రాంతాల్లో ఇంటింటి సర్వే ఎలా చెయ్యాలి అని రెవెన్యూ సిబ్బందికి విజయవాడలో ప్రత్యేక శిక్షణ కూడా ఇవ్వనున్నారని రెవెన్యు శాఖ సీనియర్ అధికారులు తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన రెవెన్యూ అధికారులు సుమారు ఐదు రోజుల పాటు విజయవాడలోని వరదపీడిత ప్రాంతాల్లో ఇంటింటి సర్వే చెయ్యనున్నారు. రెవెన్యూ శాఖతో పాటు విద్యుత్, ఎన్నికలు, భూసేకరణ, కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయం, పౌరసరఫరాల కార్యాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులను విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇంటింటి సర్వే చెయ్యడానికి నియమిస్తున్నారని అధికారులు అంటున్నారు.

## ఆ ఎమ్మెల్యేల అనర్హతపై 4 వారాల్లో నిర్ణయం తీసుకోండి



హైదరాబరాద్: పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్‌పై హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. దీనిపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ కార్యాలయాన్ని ఆదేశించింది. అనర్హత పిటిషన్ల ఫైల్‌ను స్పీకర్ ముందు ఉంచాలని అసెంబ్లీ సెక్రటరీని కోర్టు ఆదేశించింది. ఒక వేళ నాలుగు వారాల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవడంలో విఫలమైతే, పిటిషన్‌లను పరిష్కరించే సమయంలో, కేసును సుమోటోగా పునఃప్రారంభిస్తామని కోర్టు పేర్కొంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి మారిన ఎమ్మెల్యేలు వెంకటరావు తెల్లం, కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లపై అనర్హత వేటు వేసేలా ఆదేశాలు ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూనపాండు వివేకానంద, పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఆలేటి మహేశ్వర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ టికెట్‌పై ఎన్నికయ్యారు కానీ ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఫిరాయించారు. మూడు నెలల క్రితం స్పీకర్‌కు పిటిషన్ దాఖలు చేసినప్పటికీ, ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్య తీసుకోవడంలో స్పీకర్ జాప్యాన్ని విచారణ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది ఎత్తిచూపారు. ఇటువంటి జాప్యం వల్ల అధికార పార్టీకి బిఆర్ఎస్ నుండి మరిన్ని ఫిరాయింపులు జరిగే అవకాశం ఉందని వారు వాదించారు. ఈ కేసుపై హైకోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం.. ఎమ్మెల్యేల ఫిరాయింపుపై 4 వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ కార్యాలయాన్ని హైకోర్టు ఆదేశించింది.

# సైబర్ నేరాలకు అడ్డుకట్ట లేదా?



హైదరాబాద్‌కు చెందిన ఓ బాధితుడు రూ. 8.6 కోట్లు మోసపోయిన సంఘటన మరువక ముందే హైదరాబాద్‌లో మరో భారీ మోసం బయటపడింది. సైబర్ నేరస్థులు ఓ వృద్ధుడి నుంచి ఏకం గా రూ.13.26 కోట్లను కొల్లగొట్టారు. ఆన్‌లైన్ స్టాక్ బ్రోకింగ్ చిట్కాల పేరిట వచ్చిన మెసేజ్ నమ్మి పెట్టుబడి పెట్టి చివరకు మోసపోయాడు. షేర్లలో పెట్టుబడికి మొదట లాభాలు చూపించిన మోసగాళ్లు. వాటిని ఉపసంహరించుకోడానికి అవకాశం కల్పించారు. దీంతో బాధితుడు సైబర్ నేరస్థులను పూర్తిగా నమ్మి ఏకంగా రూ.13.26 కోట్లను బదిలీ చేశాడు. ఆ తరువాత ఈ మోసాన్ని గ్రహించాడు. ఇదంతా కొంతమంది వ్యక్తుల కుమ్మక్కుతో ఒక నెట్‌వర్క్‌లా జరిగింది. అసోంలో భారీ ఆర్థిక కుంభకోణం జరిగింది. దిబ్రూఘర్‌కు చెందిన ఇద్దరు స్నేహితులు జల్సాలకు బానిసై ఈజీగా డబ్బు సంపాదించుకోడానికి అడ్డదారులు తొక్కారు. ట్రేడింగ్ స్కాం చేయాలని పథకం పన్నారు. 60 రోజుల్లోగా తమ పెట్టుబడులపై 30శాతం రాబడికి హామీ ఇస్తూ పెట్టుబడిదారులను ప్రలోభపెట్టారు. అసోం, అరుణాచల్‌ప్రదేశ్‌ల్లోని ప్రజల నుంచి రూ. 2,200 కోట్లు కాజేశారు. ఈ డబ్బుతో ఫార్మాస్యూటికల్స్, ప్రొడక్షన్, కన్‌స్ట్రక్షన్ కంపెనీల్లో ఒకరు పెట్టుబడి పెట్టగా, మరొకరు అస్సామీ సినిమాల్లో పెట్టుబడి పెట్టి విలాసవంతమైన జీవితాలను గడిపారు. చివరకు పోలీస్‌లకు చిక్కారు. ఇలాంటి సైబర్ నేరాలు దేశవ్యాప్తంగా ఎక్కడో ఒకచోట బయటపడుతున్నాయి. ఇప్పుడు ప్రతి ఒక్కరికీ మొబైల్ ఫోన్ అందుబాటులోకి రావడంతో సోషల్ మీడియాను ఆసరా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఇంటర్నెట్‌లో ముఖ్యమంత్రులు, మంత్రు లు, ప్రముఖుల పేర్లతో నకిలీ ఖాతాలు సృష్టించి డబ్బులు గుంజుతున్నారు. చాలావరకు ఈ నేరాలు సామాజిక మాధ్యమాల ద్వారానే జరుగుతుంటాయి. సోషల్ మీడియాలో ఏర్పడిన పరిచయాలు, కొన్ని ప్రకటనల ద్వారా మోసాలకు పాల్పడుతున్నారు. సులువుగా తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చన్న దురాశే ఈ నేరాలకు దారి తీస్తోంది. సాధారణంగా మనకు తెలియని విషయం ఏదైనా ఉందంటే దానిపై ఆసక్తితో తెలిసిన వారి సూచనలు తీసుకుంటాం. ముఖ్యంగా పెట్టుబడి వంటి ఆర్థిక సంబంధిత విషయాలైతే కచ్చితంగా అనుభవం ఉన్న వారి సలహాలు తీసుకుంటాం. ఈ పరిస్థితినే సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. మనకు పెట్టుబడుల్లో సాయం చేస్తున్నట్టు నటించి మన సొమ్ము కాజేస్తున్నారు.సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ఉచిత స్టాక్ చిట్కాలు, సలహాలపై ప్రకటనలు విడుదల చేసి పెట్టుబడిదారులను ఆకర్షిస్తుంటారు. వివిధ క్లయింట్లు సంపాదించిన లాభాల తాలూకు నకిలీ స్క్రీన్ షాట్‌లను విడుదల చేసి నమ్మిస్తుంటారు. పెట్టుబడిదారులు పెట్టుబడి పెట్టడానికి ఆకర్షితులైతే ఆపరేటర్లు మొదట్లో డబ్బును మోసపూరిత వ్యక్తి తాలూకు బ్యాంకు ఖాతాకు బదిలీ చేస్తారు. ఈ విధంగా నమ్మించి తమ ప్రీమియం, విఐపి ఛానెళ్లకు సభ్యత్వాన్ని పొందాలని ఒత్తిడి చేస్తారు. తద్వారా మరిన్ని ఎక్కువ లాభాలు వస్తాయని హామీ ఇస్తుంటారు. బాధితులు ఒకసారి ప్రలోభాలకు గురైన తరువాత వారి బ్యాంకు ఖాతాల్లోకి పెద్ద మొత్తంలో నిధులను బదిలీ చేయాలని అడుగుతుంటారు. వెబ్‌సైట్‌లో ప్రదర్శించే నకిలీ లాభాలను ఉపసంహరించుకోడానికి పెట్టుబడిదారులు ప్రయత్నించినప్పుడు, ఉపసంహరణ ఎంపిక బ్లాక్ చేయడంతో వారు షాక్‌కు గురవుతారు. ఎంపికను అన్‌బ్లాక్ చేయడానికి స్కామ్‌స్టర్లు పన్నులు,పెనాల్టీలతో సహా వివిధ కారణాలను పేర్కొంటూ తదుపరి డబ్బు బదిలీ చేయాలని ఒత్తిడి చేస్తారు. భారీగా మొత్తాన్ని సేకరించిన తరువాత స్కామ్‌స్టర్లు అజ్ఞాతంలోకి వెళ్లిపోతుంటారు. అంతేకాదు సైబర్ నేరగాళ్లు బెదిరింపులు కూడా చేస్తుంటారు. మనీలాండరింగ్ కేసుకు సంబంధించి మీ బ్యాంకు ఖాతాలో సొమ్ము జమ అయిందని, ఎఫ్ఐఆర్ కూడా నమోదైందని, వాట్సాప్‌లో హెచ్చరికలు జారీ చేస్తుంటారు. ఆ నేరంతో తనకెలాంటి సంబంధం లేదని చెప్పినా వినకుండా అదే పనిగా బెదిరిస్తుంటారు. తాజాగా సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ పేరునే ఉపయోగించి తాను సిజెఐని అని క్యాబ్ కోసం తనకు రూ. 500 పంపాలని హెచ్చరిస్తూ మెసేజ్ కూడా వచ్చింది. ఈ విధంగా వివిధ రకాలుగా ఈ ఆన్‌లైన్ సైబర్ క్రైమ్ నేరాలు సాగుతున్నాయి. ఇలాంటి కేసులు పెరిగిపోతుండడంతో హైదరాబాద్‌లోని క్రైమ్స్ అండ్ సిట్ అధికారులు కొన్ని హెచ్చరికలను చేశారు. 'మార్కెట్ రెగ్యులేటరీ సెబీలో రిజిస్టర్ చేసినవి కాకుండా తెలియని అప్లికేషన్లలో స్టాక్ మార్కెట్ చేయవద్దు. అలాగే అవతలి వ్యక్తుల మాటలను నమ్మి వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు డబ్బును బదిలీ చేయరాదు. మోసగాళ్లు అందించే సందేహాస్పదమైన రాబడిని నమ్మవద్దు. మీ డిమ్యాట్ ఖాతా ఆధారాలను తెలియని వ్యక్తులతో పంచుకోవద్దు. గూగుల్ ప్లేస్టోర్ లేదా వారి స్వంత వెబ్‌సైట్‌ల నుండి డౌన్‌లోడ్ చేసేటప్పుడు అప్లికేషన్ల ప్రామాణికత నిర్ధారించుకోవాలి' అని క్రైమ్ విభాగం హెచ్చరికలు చేసింది. ఈ విషయంలో సెబీ యంత్రాంగం ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టడం చాలా అవసరం.

# భూతాపం.. ఓ సముద్రానికి శాపమైంది!



అరల్ సముద్రం ఎండిపోవడం వల్ల ఆ ప్రాంతంలో దుమ్ము, ఉప్పు తుఫానుల సంఖ్య బాగా పెరిగింది. ఈ ప్రాంతంలో ఏటా పది పెద్ద దుమ్ము తుఫానులు సంభవిస్తున్నాయని, వాటిలో ఎక్కువ భాగం ఏప్రిల్, జులై నెలల మధ్య సంభవిస్తున్నాయని ఉపగ్రహ చిత్రాలు వెల్లడించాయి. మానవ విధ్వంసంలో భాగంగా అదృశ్యమైన అరల్ సముద్రం చరిత్ర మనకు ఒక పాఠం చెబుతుంది. మనం ప్రకృతిని అతిగా వినియోగించుకుంటే, దాని ఫలితాలు చాలా తీవ్రంగా ఉంటాయి. నిత్యజీవితంలో ఎన్నో వింతలు జరుగుతుంటాయి. వాటిలో కొన్ని అందరినీ ఆశ్చర్యపరుస్తాయి, కొన్ని సంఘటనలు మిమ్మల్ని ఆలోచింపజేస్తాయి. నేను చెప్పబోయేది మనందరినీ ఆశ్చర్యపరిచే, ఆలోచింపజేసే అలాంటి ఒక సంఘటన. సహజంగా చెరువులు, నదులు ఎండిపోవడాన్ని మనం కొన్నిసార్లు వింటాం లేదా చూస్తాం. కానీ సముద్రం ఎండిపోవడం గురించి ఎప్పుడైనా విన్నారా? లేదు కదా? కానీ ఇది ముమ్మాటికీ నిజం. ఒకప్పుడు ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద అంతర్గత నీటివనరు, పెద్ద ఉప్పునీటి సరస్సు అయిన అరల్ సముద్రం నేడు కనుమరుగైంది అనే విషయం అందరినీ ఆలోచింపజేస్తుంది. కజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్ మధ్య ఉన్న అరల్ సముద్రం 26,300 చదరపు మైళ్ల విస్తీర్ణంలో ఉవ్వెత్తున ఎగిసిపడే అలలతో నిత్యం చేపలతో కళకళలాడుతూ ఆర్థిక వ్యవస్థకు ఎన్నుదన్నుగా నిలిచింది. అలాంటి సముద్రం గ్లోబల్ వార్మింగ్, అభివృద్ధి ప్రతికూల ప్రభావాల కారణంగా ఈ సరస్సు 1960 నుండి తగ్గిపోతూ 2010 నాటికి పూర్తిగా ఆవిరైందని పరిశోధకులు కనుగొన్నారు. వాతావరణ మార్పుల ప్రభావంతో ప్రపంచంలోని అన్ని ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిన సంగతి మనందరికీ తెలిసిందే. 1960లో అరల్ సముద్రం ఉపరితలం సముద్రమట్టానికి 175 అడుగుల (53 మీ) ఎత్తులో ఉంది. సుమారుగా 26,300 చదరపు మైళ్ళు (68,000 చదరపు కిమీ) విస్తీర్ణంలో ఉంది. అరల్ సముద్రం ఉత్తరం నుండి దక్షిణానికి 270 మైళ్ళు (435 కిమీ), తూర్పు నుండి పడమరకు 180 మైళ్ళు (290 కిమీ) ఉంది. అరల్ సముద్రం అదృశ్యం కావడానికి ప్రధాన కారణం సోవియట్ యూనియన్ ఆర్థిక విధానాలు సిర్ దర్యా, అము దర్యా నదుల నీటిని సాగునీటి ప్రాజెక్టుల కోసం, వ్యవసాయ అవసరాల కోసం మళ్లించడం వలన అరల్ సముద్రం నీటిమట్టం క్రమపద్ధతిలో భారీగా తగ్గింది. ఈ రెండు నదులు అరల్ సముద్రానికి ప్రధాన నీటివనరులు. అందువల్ల నదుల నుండి నీరు రాకపోవడంతో సముద్రం ఎండిపోవడానికి ప్రధాన కారణం. సోవియట్ ప్రభుత్వం ప్రస్తుతం ఉజ్బెకిస్తాన్, కజకిస్తాన్, తుర్క్మెనిస్తాన్ మధ్య ఆసియాలోని ఇతర ప్రాంతాలలో పెద్ద ఎకరాల పచ్చిక బయళ్లను లేదా సాగు చేసిన భూములను అము దర్యా, సిర్ దర్యా, వాటి ఉపనదుల జలాలను ఉపయోగించడం ద్వారా సాగునీటి వ్యవసాయ భూములుగా మార్చింది. 1980ల చివరి నాటికి సరస్సు 1960కి ముందు ఉన్న దాని పరిమాణంలో సగానికి పైగా కోల్పోయింది. ఫలితంగా సరస్సులోని ఉప్పు, ఖనిజాలు మరింత కేంద్రీకృతమయ్యాయి. సముద్రంలో నీరులేని కారణంగా ఇరు రాష్ట్రాలు తీవ్రనీటి సమస్యను ఎదుర్కొన్నాయి. నీటి సమస్యను పరిష్కరించేందుకు 1994లో కజకిస్తాన్, తుర్క్మెనిస్తాన్, ఉజ్బెకిస్తాన్, కిర్గిస్తాన్, తజికిస్థాన్‌లతో కలిపి అరల్ సముద్రాన్ని రక్షించే ప్రయత్నాలను చేపట్టినప్పటికీ అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. అరల్ సముద్రం నీటిమట్టం 2006, 2009 నాటికి నాలుగైదు వంతులు తగ్గింది. సముద్రం ఉత్తరభాగాన్ని రక్షించడానికి ప్రపంచ బ్యాంకు, కోక్- అరల్ డ్యామ్ నిర్మాణానికి సిర్ దర్యా వెంబడి ప్రాజెక్టుల ద్వారా నిధులు సమకూర్చబడ్డాయి. అయితే, దక్షిణ భాగం-, తూర్పు, పశ్చిమ లోబ్‌లు కానీ ముఖ్యంగా తూర్పు-ఉత్తరం -కొంత నీటి ప్రవాహం ఉన్నప్పటికీ, కుంచించుకుపోతూనే ఉంది. 2010 తర్వాత చాలా కాలం పాటు తూర్పు లోబ్ పూర్తిగా ఎండిపోయింది.అరల్ సముద్రం ఎండిపోవడంతో మత్స్య సంపద, వాటిపై ఆధారపడిన వర్గాలు కుప్పకూలాయి. పెరుగుతున్న ఉప్పునీరు ఎరువులు, పురుగుమందులతో కలుషితమైంది. వ్యవసాయ రసాయనాలతో కలుషితమైన, బహిర్గతమైన సరస్సు అడుగుభాగం నుండి వీచే దుమ్ము ప్రజారోగ్యానికి ప్రమాదంగా మారింది. సముద్రాలు, వాటి లోపల సరికొత్త ప్రపంచాన్ని కలిగి ఉన్నాయి. లోతైన సముద్రంలో ఉండే జీవులు చాలా అరుదు, అందంగా ఉంటాయి. కానీ అరల్ సముద్రం ఎండిపోవడం వల్ల చమత్కారమైన సముద్ర జీవులు నష్టపోయాయి. సముద్రం ఎండిపోవడానికి గల కారణాన్ని తెలుసుకోవడానికి శాస్త్రవేత్తలు ప్రయత్నించారు, వారు చాలా ఆశ్చర్యపోయారు. ఇది ఒకప్పుడు ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద సరస్సు. ప్రధానంగా మంచు కరగడం, సుదూర పర్వతాల నుండి కురిసే అవపాతం కారణంగా, అరల్ సముద్రం విస్తృతమైన మత్స్యకార సంఘాలకు, కజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్‌లోని చాలా శుష్క ప్రాంతంలోని సమశీతోష్ణ ఒయాసిస్‌కు మద్దతు ఇచ్చింది. కానీ 1950లు, 60లలో సోవియట్ యూనియన్ ప్రభుత్వం ఈ ప్రాంతంలోని రెండు ప్రధాన నదులైన సిర్ దర్యా, అము దర్యాలను మళ్లించే ప్రాజెక్టులను ప్రారంభించింది. అప్పటి నుండి అరల్ సముద్రం నెమ్మదిగా కనుమరుగవుతోంది.

# మోడీ పాలనలో పెరిగిన నిరుద్యోగం!

భారతదేశం అన్నిరంగాల్లో అభివృద్ధి శరవేగంగా పరుగులు పెడుతూ ఉందని, ప్రపంచంలో అతిపెద్ద ఐదవ ఆర్థిక వ్యవస్థగా ఉందని, త్వరలో ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏర్పడనుందని, ఉపాధి పెరిగి నిరుద్యోగం, పేదరికం తగ్గిందని మోడీ ప్రభుత్వ ప్రచారం ఎంత బూటకమో దేశంలో పెరిగిన నిరుద్యోగం, తగ్గిన ఉపాధిని గమనిస్తే తెలుస్తుంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్‌ఓ) భారతదేశ ఉపాధి నివేదికను 2024న విడుదల చేసింది. 20002024 వరకు నిర్వహించిన సర్వేల ద్వారా భారత ప్రభుత్వ, రిజర్వు బ్యాంకు లెక్కలను, జాతీయ నమూనా సర్వేను, పీరియాడిక్ లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ సర్వేలను ఉపయోగించి ఈ నివేదిక విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 2022లో ఉత్పత్తిలో శ్రామికుల వినియోగం (ఎల్‌ఎఫ్‌పిఆర్) 59.8 శాతంగా ఉంటే భారత దేశం 55.2 శాతంగా ఉంది. భారతదేశం పని చేయగల వయస్సు (15 నుంచి 59 సం) జనాభా 2011లో 59 శాతం ఉండగా, 2022 నాటికి 63 శాతానికి పెరిగింది. శ్రామికశక్తి పెరుగుదలకు అనుగుణంగా ఉపాధి లభించటం లేదు. కొద్ది మందికే పని దొరికిందని నివేదిక తెలిపింది. స్వయం ఉపాధి గణాంకాల విభాగం విడుదల చేసిన జులై 2022 నుంచి జులై 2023 వరకు మోడీ ప్రభుత్వంలో అత్యంత వినాశకర ఉపాధి తీరు వెల్లడైంది. దేశం మొత్తం ఉపాధిలో 58% స్వయం ఉపాధి పొందుతున్నారు. 2017 -18లో వీరు 52% మాత్రమే ఉన్నారు. దీన్ని గమనిస్తే ప్రభుత్వం కల్పించే ఉపాధి లేక ప్రజలు స్వయం ఉపాధిని ఆశ్రయించటం ఎక్కువైంది. స్వయం ఉపాధి పొందుతున్నవారు చిన్నవ్యాపారులు, చేతి వృత్తిదారులే. ఆర్థిక వేత్త సంతోష్ మెహ్రోత్రా చెప్పిన దాని ప్రకారం స్వయం ఉపాధి కార్మికుల సంఖ్య 2017- 18లో 4 కోట్ల మంది ఉండగా, 2022-23 నాటికి 9 కోట్ల, 50 లక్షలకు పెరిగింది. 92 దేశాలు అనుసరిస్తున్న అంతర్జాతీయ కార్మిక సంస్థ సూచించిన పద్ధతి ప్రకారం జీతం చెల్లించని ఇలాంటి వారిని ఉపాధి పొందిన కార్మికులుగా పరిగణించటం లేదు. దీన్ని గమనిస్తే ఉపాధి కల్పనలో ఎంతగా మోడీ ప్రభుత్వ వైఫల్యం చెందింది తెలుస్తుంది. దేశంలో వ్యవసాయ రంగం ద్వారానే ఇప్పటికీ ఎక్కువగా ఉపాధి దొరుకుతుంది. నేషనల్ శాంపిల్ సర్వే ( ఎన్ఎస్ఎస్) నివేదిక 38వ రౌండ్ (9183) నివేదిక ప్రకారం 77% గ్రామీణ కుటుంబాలు జీవనోపాధి కొనసాగించడానికి వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్నాయి. 201819కి సంబంధించిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్



సర్వే తాజా నివేదిక ప్రకారం వ్యవసాయంపై గ్రామీణ కుటుంబాలు ఆధారపడటం 53 శాతానికి తగ్గింది. జాతీయ జిడిపిలో వ్యవసాయ రంగం వాటా 43% నుంచి 16 శాతానికి తగ్గింది. అందుకు కారణం సేద్యపు ఖర్చులు పెరగడం, పంటలకు న్యాయమైన గిట్టుబాటు ధరలు లభించకపోవటం, వ్యవసాయం వల్ల వచ్చే ఆదాయం చాలకపోవటం, అప్పుల పాలు కావడం వల్ల రైతులు వేరే ఉపాధి చూసుకోవటం కారణంగా ఉంది. ఇదే క్రమంలో గమనించాల్సిన అంశం ఒకటుంది. అది మహిళల వ్యవసాయ ఉపాధి రేటు ఇప్పటికీ 82 నుండి 72 శాతానికి మాత్రమే తగ్గింది. వ్యవసాయ పనులైన నాట్లు, కోత, కలుపుతీయటం, విత్తనాలు వేయడం మొదలైన పనుల్లో మహిళల పాత్ర ఎక్కువగా ఇప్పటికీ ఉంది. మహిళల ఉపాధి కూడా కొద్ది మేర తగ్గడానికి కొన్ని ప్రాంతాల్లో యంత్రాల వినియోగంతోపాటు ప్రకృతి సృష్టిస్తున్న కరవు, వరదలు కూడా వ్యవసాయ రంగంలో ఉపాధి తగ్గడానికి కారణం. వీటిని గమనించినప్పుడు గ్రామీణ ఉపాధికి వ్యవసాయమే ప్రధానంగా ఉండి అత్యధిక గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పిస్తున్నది. మరో ముఖ్యమైన విషయం కూడా గమనించాల్సిన అవసరం ఉంది. 2000 నుంచి 2012 వరకు వ్యవసాయంలో ఉపాధి పొందే వారి వాటా స్వల్పంగా తగ్గినా, కోవిడ్ కాలంలో వ్యవసాయ రంగమే ఎక్కువ ఉపాధి కల్పించింది. గ్రామీణ ప్రాంతాల నుంచి ఉపాధి కోసం పట్టణాలకు, నగరాలకు వలసలు వెళ్లిన పేదలు కోవిడ్ వలన ఉపాధి కోల్పోయి తిరిగి గ్రామీణ ప్రాంతాలకు వచ్చినప్పుడు వారిని వ్యవసాయ రంగం ఆదుకున్న వాస్తవాన్ని గ్రహిస్తే వ్యవసాయ రంగ ప్రాముఖ్యత తెలుస్తుంది. ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలఫ్‌మెంట్ మరియు అంతర్జాతీయ కార్మిక సంస్థ సంయుక్తంగా రూపొందించిన ఇండియా ఎంప్లాయ్ మెంట్ రిపోర్టు 2024 ప్రకారం భారతదేశ శ్రామిక జనాభా 2011లో 61%గా ఉంటే, 2024లో 64 శాతంగా ఉంది. యువత ఉపాధి 37 శాతం క్షీణించింది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) తాజా వివరాల ప్రకారం మే 2024లో నిరుద్యోగం 7 శాతం కాగా, జూన్ 2024లో 9.2% కి పెరిగింది. కన్స్యూమర్ పిరమిడ్స్ హౌస్ హెూల్ సర్వే ప్రకారం జూన్ 2024లో మహిళా నిరుద్యోగం 18 శాతానికి చేరింది. ఇది జాతీయ సగటుకన్నా ఎక్కువ. 2023లో మహిళా నిరుద్యోగం 15 శాతంగా ఉంది. కార్మిక శక్తి వినియోగం 2024 మేలో 40.8% ఉంటే, జూన్‌లో 41.4 శాతానికి పెరిగింది. పట్టణ నిరుద్యోగం మే 2024లో 6.3 శాతం ఉంటే, జూన్‌లో 8.9 శాతానికి పెరిగింది. భారతదేశ ఉపాధి నివేదిక 2024 ప్రకారం నిరుద్యోగ శ్రామిక శక్తిలో దాదాపు 83% యువత ఉన్నది. మొత్తం నిరుద్యోగ యువతలో మాధ్యమిక లేక ఉన్నత విద్య పూర్తిచేసిన యువకుల వాటా 2000 సంవత్సరంలో 32.2% ఉంటే 2022లో 65.7% కి పెరిగింది. మోడీ ప్రభుత్వం ఉద్యోగ కల్పన కల్పించ పోగా ఉన్న ఉద్యోగాల్లో కూడా తగ్గించింది. ఫలితంగా నిరుద్యోగం పెరుగుతూ ఉంది. దేశం మొత్తంమీద ఉన్న 389 ప్రభుత్వ రంగ సంస్థల్లో 2014లో 16.9 లక్షల ఉద్యోగాలు ఉండగా, 2022లో ఈ సంఖ్య 14.6 లక్షలకు తగ్గింది. ఒక్క బిఎస్ఎన్ఎల్ లోనే గత 9 సంవత్సరాల్లో లక్షా 81వేల మందిని ఇంటికి పంపింది. ఈ విధంగా మోడీ ప్రభుత్వ పాలనలో ఉపాధి తగ్గి నిరుద్యోగం పెరిగింది.